# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 287, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం - 31- డిసెంబర్ - 2024

పూజారులకు నెలకు రూ.18 వేల జీతం..

## ఎన్నికల హామీ ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్



గురుద్వారాల గ్రంథిలకు కూడా నెలకు రూ.18,000 వేతనం

పూజారులు నిస్వార్థంగా సమాజానికి సేవ చేస్తున్నారు

వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు

రేపటి నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియను నేనే ప్రారంభిస్తాను

మీడియా సమావేశంలో ఆప్ అధినేత అరవింద్

2లో

## సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేలో భారీగా ఉద్యోగాలు.. ఎలాంటి రాత పరీక్ష లేదు



ఢిల్లీ: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన సికింద్రాబాద్ రైల్వే జోన్‌లో పదో తరగతి అర్హతతో ఉద్యోగాల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్‌సీఆర్ యూనిట్ పరిధిలోని పలు ప్రదేశాల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తారు. ఆసక్తి కలిగిన వారు ఆన్ లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాల వారీగా ఖాళీల వివరాలు, ఎంపిక విధానం ఈ కింద చెక్ చేసుకోవచ్చు.. దక్షిణ మధ్య రైల్వేకి చెందిన సికింద్రాబాద్ రైల్వే జోన్‌లో 4,232 ఎస్‌సీఆర్ వర్క్‌షాప్/ యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతూ ప్రకటన జారీ చేసింది. ఈ మేరకు రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల వివరాలు కేటగిరీల వారీగా చూస్తూ.. ఎస్సీ- 635, ఎస్టీ- 317, ఓబీసీ- 1143, ఈడబ్ల్యూఎస్- 423, యూఆర్- 1714 చొప్పున ఉన్నాయి. ఎస్‌సీఆర్ పరిధిలోకి వచ్చే జిల్లాల్లో నివసించే అభ్యర్థులు మాత్రమే

## శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు షురూ




2లో

- ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు శ్రీశైలం ఆలయంలో బ్రహ్మోత్సవాలు
- బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చిన ఈవో శ్రీనివాసరావు
- పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన ఈవో

# ‘తెలుగుతల్లికి జలహారతి’...

- భారీ ప్రాజెక్టు పేరు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఏపీ ప్రభుత్వం భారీ ఎత్తున తీసుకువస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు
- ఏపీకి గేమ్ చేంజర్ అవుతుందన్న చంద్రబాబు
- నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామని వెల్లడి



అమరావతి: ఏపీ ప్రభుత్వం భారీ ఎత్తున తీసుకువస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టు పేరును ప్రకటించారు. ‘తెలుగుతల్లికి జలహారతి’ అని ప్రాజెక్టు పేరు వెల్లడించారు. ప్రాజెక్టు గురించి చెబుతూ, రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగితే రతనాల సీమ అవుతుందని అన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తరచుగా కరవు బారినపడుతున్నాయని వివరించారు. పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాల నీటి వినియోగం కారణంగా... కృష్ణా నదిలో తగినంత నీటి లభ్యత ఉండడం లేదని వివరించారు. ఒక్క గోదావరి నదిలో మాత్రమే ఆశించిన మేర జలాలు అందుబాటులో ఉంటున్నాయని చంద్రబాబు తెలిపారు. గోదావరి నీటిని మళ్లించగలిగితే రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చని పేర్కొన్నారు. నదులు అనుసంధానం చేయగలిగితే రాష్ట్ర వ్యవసాయ రంగానికి నీటి కొరత అనే మాట వినిపించదని స్పష్టం చేశారు. గోదావరి నుంచి కనీసం 300 టీఎంసీల నీటిని కృష్ణా నదికి తీసుకురావడం... కృష్ణా పశ్చిమ, తూర్పు డెల్టాలకు నీళ్లు ఇచ్చిన తర్వాత ఇక్కడ్నించి బనకచర్లకు నీటిని తీసుకువెళ్లడం ఈ ప్రాజెక్టులో ప్రధానమైన అంశం. ఇది మూడు దశల్లో ఉంటుంది. దీనిద్వారా వెలుగొండ ఆయకట్టు కూడా కవర్ అవుతుంది. నాగార్జునసాగర్ కుడి కాలువపై బొల్లాపల్లి ప్రాజెక్టు వస్తుంది... ఆ తర్వాత వెలుగొండ ప్రాజెక్టు... అక్కడ్నించి బనకచర్ల ప్రాజెక్టుకు నీళ్లు వెళతాయి. నల్లమల అడవులను కొంతమేర నరికి టన్నెల్ ఏర్పాటు చేసిన బనకచర్లకు నీళ్లు తీసుకువెళతాం. ఇదంతా జరిగితే నదుల అనుసంధానం పూర్తవుతుంది. ఈ నదుల అనుసంధానం ప్రక్రియలో ఇవే కాకుండా మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే శ్రీకాకుళ, విజయనగరం, విశాఖ, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లా కొన్ని భాగాలు, నెల్లూరు, కడప, అనంతపురం... ఇలా రాష్ట్రమంతా అనుసంధానమై అదనపు ఆయకట్టు కూడా వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రాజెక్టు ఏపీకి ఒక గేమ్ చేంజర్. అందుకే దీనిపేరు కూడా తెలుగుతల్లికి జలహారతి అని నామకరణం చేశాం. అంటే మనం సమర్పించుకోవడం. కన్నతల్లికి రుణం తీర్చుకోవడం అనే అర్థంలో ఈ పేరు పెట్టాం. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదికను పంపిస్తున్నాం” అని చంద్రబాబు వివరించారు.

## లైంగిక వేధింపుల వివాదం తర్వాత తొలిసారి సందేశ్‌ఖాలీకి మమతా బెనర్జీ



2లో

- సందేశ్‌ఖాలీలోని టీఎంసీ నేత షాజహాన్‌పై భూ ఆక్రమణలు, అత్యాచార ఆరోపణలు
- రేషన్ కుంభకోణంలోనూ ఆయనపై ఆరోపణలు
- దాడులకు వెళ్లిన ఈడీ అధికారులపై సందేశ్‌ఖాలీలో దాడి
- సందేశ్‌ఖాలీలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించనున్న మమత



## బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఆసక్తికరంగా రాజకీయం

రెండు పార్టీ నేతలు ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు

కాంగ్రెస్‌కు కౌంటర్.. సోనియాపై జేపీ నడ్డా విమర్శలు





## ఏపీలో మరో భారీ ప్రాజెక్టు... చంద్రబాబు సమీక్ష



2లో

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో నీటిపారుదల శాఖపై సమీక్ష
- ప్రతి ఎకరాలకు నీళ్లిచ్చేలా ప్రణాళిక
- సముద్రంలో వృధాగా కలిసే నీటిని మళ్లించే బృహత్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు
- కేంద్రం సాయం తీసుకోవాలని నిర్ణయం

## గోటితో పోయే దాన్ని గోడ్డలి వరకు తెచ్చారు...

బన్నీ అరెస్ట్ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మంగళగిరిలో మీడియాతో మాట్లాడిన జనసేనాని

బన్నీ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో తనకు తెలియదన్న పవన్

అల్లు అర్జున్ తరపున బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉండాల్సిందని వ్యాఖ్య

ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టలేనన్న డిప్యూటీ సీఎం



మంగళగిరి: ఈ నెల 4న ‘పుష్ప2’ ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన, నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వివాదంపై తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. మంగళగిరిలో జనసేనాని మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గోటితో పోయే దాన్ని గోడ్డలి వరకు తెచ్చారని పవన్ పేర్కొన్నారు. “బన్నీ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు తెలియదు. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. చట్టం అందరికీ సమానమే. పోలీసులు తప్పకుండా భద్రత గురించి ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. ఆయన కూర్చున్నాక చెప్పి తీసుకెళ్లాల్సింది. చెప్పినా ఆయనకు ఆ అరుపుల్లో సరిగా వినిపించకపోవచ్చు. అల్లు అర్జున్

మిగతా..2లో

## మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి..

- అసెంబ్లీలో రేవంత్ సర్కార్ తీర్మానం
- మద్దతు తెలిపిన విపక్ష బీఆర్ఎస్ పార్టీ
- దేశానికి ఎనలేని సేవలు అందించారంటూ కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
- భారతరత్న అవార్డుకు పూర్తి అర్హులన్న మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల కన్నుమూసిన భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారత రత్న’ ప్రకటించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి విపక్ష బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలియజేసేందుకు తెలంగాణ అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిలూదారని ప్రశంసించారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థను వృద్ధిబాట పట్టించారని కొనియాడారు. దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని, వరుసగా రెండు పర్యాయాలు ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ఆర్బీఐ గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించారని

మిగతా..2లో



## తిరుమల దర్శనం... తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు చంద్రబాబు అంగీకారం

చంద్రబాబుతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సమావేశం

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చర్చ

వారానికి నాలుగు సిఫార్సు లేఖలకు ఏపీ సీఎం అంగీకారం

## రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడినట్లుగా ఉంది...

ఎవరూ చెప్పడం లేదు: బండి సంజయ్

చట్టం తన పని తాను చేసుకుపోతే అసెంబ్లీలో చర్చ ఎందుకని ప్రశ్న



ఆరు గ్యారెంటీల అమలును పక్కదారి పట్టించేందుకే అరెస్ట్ చేశారని విమర్శ

పుష్ప-3 రాకముందే ఆ సినిమాను చూపించారన్న బండి సంజయ్

## పూజారులకు నెలకు రూ.18 వేల జీతం..

# ఎన్నికల హామీ ప్రకటించిన అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ: త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ తిరిగి విజయం సాధిస్తే దేవాలయాల పూజారులు, గురుద్వారాల గ్రంథి లకు నెలకు రూ.18 వేల వేత్తనాన్ని చెల్లిస్తామని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఈమేరకు సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన మరో ఎన్నికల హామీని ఆయన వెల్లడించారు. "పురోహితులు, గ్రంథిలు మన మతపరమైన ఆచారాలకు సంరక్షకులుగా కొనసాగుతున్నారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోలేదు. అందుకే మేము మళ్లీ అధికారంలోకి వస్తే నెలనెలా రూ.18,000 జీతం చెల్లిస్తాం. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి (మంగళవారం) నుంచి ప్రారంభమవుతుంది. హనుమాన్ ఆలయంలో నేనే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తాను" అని కేజ్రీవాల్ తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు సృష్టించవద్దని బీజేపీని తాను అభ్యర్థిస్తున్నానని, ఈ ప్రక్రియను అడ్డగిస్తే పాపం చేసినట్లే అవుతుందని కేజ్రీవాల్ హెచ్చరించారు. పూజారులు, గ్రంథిలు మన దేవుళ్లకు వారధిగా ఉంటున్నారని కొనియాడారు. కాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆప్ పార్టీ వరుసగా ఎన్నికల హామీలను ప్రకటిస్తోంది. ముందుగా సీనియర్ సిటిజన్ల కోసం 'సంజీవని' పథకం, ఆ తర్వాత 'మహిళా సమ్మాన్ యోజన', తాజాగా అర్చకులకు నెలవారీ వేతన పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి ప్రకటించారు. సంజీవని యోజన కింద 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత ఆరోగ్య సంరక్షణ ఉంటుంది. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఆర్థిక సాయం అందజేస్తామని ఆప్ పార్టీ ప్రకటించింది.

# సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేలో భారీగా ఉద్యోగాలు..

మొదటి పేజి తరువాయి

ఎస్‌సీఆర్ పరిధిలోకి వచ్చే జిల్లాల్లో నివసించే అభ్యర్థులు మాత్రమే ఈ ఖాళీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు జనవరి 27, 2025వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఎస్‌సీఆర్ యూనిట్ ప్రదేశాలు ఏమేం ఉన్నాయంటే.. సికింద్రాబాద్, లల్లాగూడ, మెట్టుగూడ, ఖాజీపేట, హైదరాబాద్, విజయవాడ, బిట్రగుంట, గూడూరు జంక్షన్, కాకినాడ పోర్టు, కొండపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్, ఒంగోలు, రాజమండ్రి, రాయనపాడు, నల్లపాడు, గుంటూరు, గుంతకల్, తిమ్మనచర్ల, యాద్‌గిర్, నాందేడ్, పూర్ణ జంక్షన్, ముద్‌ఖేడ్.

ఈ పోస్టుకలు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత పొంది ఉండాలి.

ట్రేడుల వారీగా అప్రెంటీస్ ఖాళీల వివరాలు..
ఏసీ మెకానిక్ ఖాళీల సంఖ్య: 143,
ఎయిర్ కండిషనింగ్ ఖాళీల సంఖ్య: 32,
కార్పెంటర్ ఖాళీల సంఖ్య: 42
డీజిల్ మెకానిక్ ఖాళీల సంఖ్య: 142
ఎలక్ట్రానిక్ మెకానిక్ ఖాళీల సంఖ్య: 85
ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ ఖాళీల సంఖ్య: 10
ఎలక్ట్రీషియన్ ఖాళీల సంఖ్య: 1053
ఎలక్ట్రికల్ (ఎస్-టి) (ఎలక్ట్రీషియన్) ఖాళీల సంఖ్య: 10
పవర్ మెయింటెనెన్స్ (ఎలక్ట్రీషియన్) ఖాళీల సంఖ్య: 34
ట్రైన్ లైటింగ్ (ఎలక్ట్రీషియన్) ఖాళీల సంఖ్య: 34
ఫిట్టర్ ఖాళీల సంఖ్య: 1742
మోటార్ మెకానిక్ వెహికల్ (ఎంఎంవీ) ఖాళీల సంఖ్య: 8
మెషినిస్ట్ ఖాళీల సంఖ్య: 100
మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్ (ఎంఎంటీఎం) ఖాళీల సంఖ్య: 10
పెయింటర్ ఖాళీల సంఖ్య: 74
వెల్డర్ ఖాళీల సంఖ్య: 713

వయోపరిమితి డిసెంబర్ 28, 2024 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంది. ఆసక్తి కలిగిన వారు జనవరి 27, 2025వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి, ఐటీఐలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

# గోటితో పోయే దాన్ని గోడ్డలి వరకు తెచ్చారు...

మొదటి పేజి తరువాయి

అల్లు అర్జున్ తరపున బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉండాల్సింది. చిరంజీవి కూడా గతంలో ఫ్యాన్స్‌తో కలిసి థియేటర్‌లో సినిమాలు చూసేవారు. కానీ, ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కింది స్థాయి నుంచి వచ్చిన గొప్ప నాయకుడు. వైసీపీ విధానాల తరహాలో అక్కడ ఆయన వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపునకు అవకాశం ఇచ్చారు" అని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి..

ఆర్బీఐ గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా పనిచేశారని చెప్పారు. దేశానికి విశిష్ట సేవలు అందించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. విపక్షనేత, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందని ప్రకటించారు. దేశ అత్యున్నత పౌరపురస్కారానికి మన్మోహన్ సింగ్ పూర్తి అర్హులు అని పేర్కొన్నారు.

## లైంగిక వేధింపుల వివాదం తర్వాత

# తొలిసారి సందేశ్‌ఖాలీకి మమతా బెనర్జీ

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో స్థానిక మహిళలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ నేతలు అత్యాచారానికి తెగబడడంతోపాటు భూములను కబ్జా చేసినట్టు ఈ ఏడాది మొదట్లో ఆరోపణలు వచ్చాయి. దేశవ్యాప్తంగా ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలిసారి నేడు సందేశ్‌ఖాలీలో పర్యటించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన పర్యటనపై మమత గత వారం మాట్లాడుతూ సందేశ్‌ఖాలీ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పంపిణీ చేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించబోతున్నట్టు చెప్పారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఈ ప్రాంతంలో దాదాపు 20 వేల మంది ప్రయోజనం పొందబోతున్నట్టు చెప్పారు. స్టేజిపై తాను 100 మందికి వివిధ పథకాలకు సంబంధించి సర్టిఫికెట్లను ఇవ్వబోతున్నట్టు చెప్పారు. కాగా, రేషన్ పంపిణీకి సంబంధించి కోట్ల రూపాయల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సందేశ్‌ఖాలీకి చెందిన టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇంటిపై దాడికి వెళ్లిన ఈడీ అధికారులపై ఈ ఏడాది జనవరిలో దాడి జరిగింది. వారి వాహనాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన తర్వాత సందేశ్‌ఖాలీకి చెందిన పలువురు మహిళలు షాజహాన్, ఆయన అనుచరులపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ భూములను ఆక్రమించుకోవడంతోపాటు తమపై లైంగికదాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇది రాజకీయంగానూ దుమారం రేపింది. షాజహాన్‌ను అరెస్ట్ చేయాలంటూ బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు డిమాండ్ చేశాయి. 55 రోజుల తర్వాత షాజహాన్ అరెస్టయ్యారు. అనంతరం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా, ఈ ఘటన వెనక బీజేపీ కుట్ర ఉందని అప్పట్లో మమత ఆరోపించారు. ఈ ఘటన తర్వాత మమత తొలిసారి నేడు సందేశ్‌ఖాలీని సందర్శించనున్నారు.

# శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు షురూ

శ్రీశైలం: ఏపీలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి1వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు శనివారం పలు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆయన వెంట సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శన వేదిక, ఏనుగుల చెరువు కట్ట తదితర ప్రదేశాలను వారు పరిశీలించారు. గంగాధర మండపం నుంచి నంది గుడి వరకూ ప్రధాన రహదారికి ఇరువైపుల భక్తులు సేద తీరేందుకు గానూ తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేయాలని ఈవో ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ షెడ్లలో గ్రీన్ మ్యాట్లు కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లు, ప్రధాన రహదారికి ఇరువైపుల సామానులు భద్రపరుచుకునే గది, పాదరక్షలు భద్రపరుచుకునే గదులు ఏర్పాటు చేయాలని, వీటిని వీలైనంత విశాలంగా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లకు కుడి వైపున శాశ్వత ప్రాతిపదికన షెడ్లు నిర్మించాలని ఈవో శ్రీనివాసరావు చెప్పారు. వివిధ పార్కింగ్ ప్రదేశాలలో జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు వెంటనే గ్రావెల్ తోలించి ఆయా ప్రదేశాలను చదును చేసి లెవెలింగ్ పనులు ప్రారంభించాలని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు వాటి పరిసరాలు అన్నీ శుభ్రంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. అన్ని ప్రదేశాలలో ఎక్కువ సంఖ్యలో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలానే మంచినీటి సదుపాయం, తాత్కాలిక విద్యుదీకరణ పనులు చేయాలని చెప్పారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఎక్కువ సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, అలాగే పార్కింగ్ ప్రదేశాలలో ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిల్లో సమాచార కరపత్రాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అయా పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాల్సిన దారులు, పార్కింగ్ స్థలాలు తెలిపే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఈవో ఆదేశించారు. ప్రముఖులు, అధికారుల వాహనాల నిలుపుదలకు మాడ వీధిలోని కళా ప్రాంగణం వెనుక పార్కింగ్ ప్రదేశం ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

# రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడినట్లుగా ఉంది... ఎవరూ చెప్పడం లేదు: బండి సంజయ్

తెలంగాణ: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి, సినీ నటుడు అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడినట్లుగా తనకు అనుమానం కలుగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కానీ ఎక్కడ చెడిందో ఇద్దరిలో ఎవరూ చెప్పడం లేదన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... సంధ్య థియేటర్ ఘటన, నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, అలాంటప్పుడు అసెంబ్లీలో చర్చ ఎందుకని ప్రశ్నించారు. పుష్ప-3 సినిమా రాకముందే సీఎం రేవంత్ రెడ్డి పుష్ప-3ని చూపించారని చురక అంటించారు. ఈ సినిమాకు 1,700 కోట్ల కలెక్షన్లు వచ్చాయని, జాతీయస్థాయిలోనూ ఈ సినిమాకు పేరు వచ్చిందన్నారు. తెలంగాణలో చాలామంది హీరోలు ఉన్నారని... కానీ అల్లు అర్జున్ పట్ల ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. వారి మధ్య ఎక్కడో చెడిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలును పక్కదారి పట్టించేందుకే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని విమర్శించారు.

# తెలుగు రాష్ట్రాల్లో నేరాలు - ఘోరాలు

తెలంగాణ/అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాదితో పోలిస్తే ఏ ఏ కేసులు పెరిగాయి? తెలంగాణా పెరిగి సైబర్ నేరాలు.. ఎపిలోనూ అదే పరిస్థితి. ఇప్పటికే నెంబర్స్ రిలీజ్ చేసిన ఇరు రాష్ట్రాల డిజిపి. పోటీగా గట్టిగా రికవరీలు చేస్తున్న పోలీసులు. కానీ, గోల్డెన్ అవరే కీలకం అంటూ పోలీసుల సూచన. ఎన్ని రకాల హెచ్చరికలు చేస్తున్నా కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు ఫ్రాడ్ గాళ్ళు. మొత్తానికి.. ఏడాది చివరికి వచ్చేశాం. తీపి గుర్తులు, అందమైన జ్ఞాపకాలు చాలామందికి ఉంటాయ్. వాళ్లని ఆ ఆనందడోలికల్లో అలా ఉండనిద్దాం. కాని, కొందరి విషయంలో మానని గాయాలు, తలుచుకుంటేనే వణికిపోయేంత దారుణాలు జరిగి ఉంటాయి. వాటి గురించి మాట్లాడుకుందాం. విజయం వల్ల వచ్చే లాభాల కంటే ఓటమి నేర్పే పాఠాలే ఎక్కువన్నట్టు.. సమాజంలో జరుగుతున్న దారుణాలను ఓ కంటకనిపెడితేనే.. బహుశా అలాంటి పరిస్థితి మనకు రాకుండా జాగ్రత్తపడొచ్చు. అవగాహన కల్పించడం అంటే ఇదే. 'ఇదిగో ఫలానా చోట ఇలా నేరం జరిగింది.. రేప్పొద్దున మీకూ ఎదురైతే ఇలా స్పందించండి' అని చెప్పడమే అవేర్‌నెస్. పాము కాటు వేస్తే.. ఆ విషాన్ని విరిచేసే ఔషధం కూడా పాము విషమే. సో, నేరాల నుంచి, మోసాల నుంచి బయటపడాలంటే.. పర్టిక్యులర్‌గా కొన్ని నేరాల గురించి, అవి ఏ పరిస్థితుల్లో జరుగుతున్నాయో తెలుసుకుని తీరాలి. క్రైమ్ రేట్ ఎక్కడ ఎక్కువగా ఉందో అవగాహన పెంచుకోవాలి. 'దొంగలున్నారు జాగ్రత్త' అని బోర్డ్ పెడతారు. ఎవరు పెడతారు ఆ బోర్డు? ఇంకెవరు.. పోలీసులే..! దొంగలు ఉన్నారు అని తెలిసీ వారిని పట్టుకోకుండా.. అలా బోర్డులు పెడితే ఏం లాభం? ఈ డౌట్ చాలా మందికి వచ్చి ఉంటుంది కదా. సో, దీనికి సమాధానం ఏంటంటే.. నేరాలను అదుపు చేయడం అనేది ఆల్‌మోస్ట్ ఇంపాజిబుల్. ఓసారి గూగుల్ చేసి చూడండి. 'జీరో క్రైమ్ కంట్రీ' అని సెర్చ్ చేయండి. ఐస్‌లాండ్, న్యూజిలాండ్, ఐర్లాండ్.. ఇలాంటి దేశాల పేర్లు కనిపిస్తాయి మనకు. అలాగని అక్కడ నేరాలే ఉండవా అంటే.. 'తక్కువ' నేరాలు జరుగుతాయి అని రాసి ఉంటుంది. సో, ఈ భూమ్మీద నేరాలు జరగని ప్రాంతమే లేదు. ఈ భూమ్మీద పుట్టే ప్రతి మనిషికి.. మరో మనిషితో పోలికే లేని వేలిముద్రలు ఎలా పుట్టుకొస్తాయో.. నేరాలు కూడా అలాగే పుట్టుకొస్తాయి. ఎవరు, ఎలా, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు నేరం చేస్తారో ఊహించేంత టెక్నాలజీ, అలాంటి భవిష్యవాణి, వాళ్లను ఆపగలిగేంత శక్తి మన దగ్గర లేదు. సో, 'దొంగలున్నారు జాగ్రత్త' అని బోర్డ్ చూసి, ఎవరికి వాళ్లు అలర్ట్‌గా ఉండడం ఒక్కటే పరిష్కార మార్గం. సో, సమాధానం వచ్చేసిందనుకుంటా.. దొంగలుంటారని తెలిసినా వాళ్లని పట్టుకోకుండా ఎందుకని బోర్డ్ పెడతారో..! ఇక అసలు విషయానికొద్దాం. తెలంగాణలో.. పర్టిక్యులర్‌గా హైదరాబాద్‌లో.. ఈ ఏడాది జరిగిన క్రైమ్ రేట్ ఎంతో చూద్దాం. హైదరాబాద్-సైబరాబాద్-రాచకొండ.. ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో జరిగిన నేరాలు-ఘోరాలే.. ఓవరాల్ హైదరాబాద్ క్రైమ్ రేట్. ముందుగా హైదరాబాద్ కమిషనరేట్. ఏడాది ప్రశాంతంగానే గడిచింది.. కాని, క్రైమ్ రేట్ పెరిగింది. ఇక్కడో విషయం గుర్తుంచుకోవాలి. నేరాలు పెరిగాయని ఎలా తెలుస్తుంది? ఫైర్ ఫైల్ అయితేనే కదా. అంటే.. కంప్లైంట్ ఇస్తేనే కదా. ఈ కంప్లైంట్ చేయాలనే అవగాహన బాగా పెరిగింది జనాల్లో. నిత్యం ఎక్కడో అక్కడ క్రైమ్ జరుగుతూనే ఉంటుంది. కాని, చాలా కేసులలో కంప్లైంట్స్ చేయరు. బట్.. జనాల్లో అవగాహన పెరుగుతున్న కొద్దీ, ఫ్రెండ్లీ పోలీసింగ్ కారణంగా జనాల్లో ధైర్యం వస్తున్నకొద్దీ.. నిర్భయంగా పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారు. అందుకే, ప్రతి ఏటా క్రైమ్ రేట్ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. సపోజ్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధినే తీసుకుంటే.. ఈ ఏడాది 35వేల 944 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయ్యాయి. గతేడాది కంటే 45 శాతం ఎఫ్ఐఆర్‌ల నమోదు పెరిగింది. హత్యలు 13 శాతం తగ్గడంతో పాటు హత్యాయత్నం కేసులు కూడా తగ్గాయి. బట్.. కిడ్నాప్ కేసులు 88 శాతం పెరిగాయి. సో, మహిళలు, ఆడపిల్లలు, పిల్లల విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండడమే బెటర్ అని సూచిస్తోంది ఈ ఇయర్ డేటా. అందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాల్సింది డిజిటల్ అరెస్టులు గురించి. ఇదీ సైబర్ నేరాల్లో ఒక భాగం. ఈ సైబర్ నేరాల గురించి కాసేపట్లో డిటైల్డ్‌గా చెప్పుకుందాం. ఇక ఈ ఏడాది ఆస్తులకు సంబంధించిన కేసులు 67 శాతం పెరిగాయి. మరీ ముఖ్యంగా రియల్ ఎస్టేట్ మోసాలు ఈ ఏడాది బాగా పెరిగాయి. డిపాజిట్ పేర్లతో, ప్రీ లాంచింగ్ ఆఫర్లతో జనాల్ని ముంచేశాయి కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు. స్కీమ్స్‌లో, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని మాయ చేసి కోట్లు దోచేశారు. ఒక్క సైబరాబాద్ పరిధిలోనే.. 3వేల కోట్లు, హైదరాబాద్ పరిధిలో వెయ్యి కోట్లు దోచేశారు. బాధాకరమైన విషయం ఏంటంటే.. పోలీసులు అరెస్ట్‌లైతే చేయగలుగుతున్నారు గానీ.. రికవరీ చేయలేకపోతున్నారు. దోచేసిన డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెట్టేస్తుండడంతో రికవరీ జరగడంలేదు. పైగా.. వాళ్లే బెయిల్ మీద బయటకు వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారు. సో, ఇప్పటికైనా ప్రీ లాంచింగ్ పేరు చెప్పి ఇల్లు కట్టిస్తామని చెబితే నమ్మకండి. అందమైన బ్రోచర్లు చూసి ఊరు పేరు లేని రియల్ ఎస్టేట్ సంస్థల దగ్గరికి వెళ్లకండి. చిన్న పెట్టుబడితో బోలెడు లాభాలు చూపిస్తామంటే.. నమ్మి బుట్టలో పడకండి.

ఇక రాచకొండ పోలీస్ కమిషనరేట్. ఇక్కడ జరిగిన నేరాలు తక్కువ.. సైబర్ మోసాలు ఎక్కువ. లాస్ట్ ఇయర్‌తో కంపేర్ చేస్తే నేరాలు 4 శాతం పెరిగాయి. ఇక లైంగిక దాడులు 17 శాతం పెరిగాయి. సో, మహిళలు, ఆడపిల్లల విషయంలో కుటుంబం తరపు నుంచి కూడా కొన్ని జాగ్రత్తలు అవసరం. ఇక వరకట్న హత్యలు 13 శాతం, హత్యలు 11 శాతం, కిడ్నాప్‌లు 10 శాతం, భౌతిక దాడులకు సంబంధించి 9 శాతం కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఇక సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్. గతేడాదితో పోలిస్తే క్రైం రేట్ ఏకంగా 64 శాతం పెరిగింది. మొత్తం మూడు పోలీస్ కమిషనరేట్లలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ఎక్కువ నేరాలు జరిగాయి. అయితే.. వీటిలో ఆస్తి గొడవలు, ఆర్థిక నేరాలు, సాధారణ దాడులే ఎక్కువ. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు చాలా ఎక్కువగా జరిగాయి. వరకట్న వేధింపుల కేసులు కూడా గతేడాదికంటే ఎక్కువగా నమోదయ్యాయి. తెలంగాణలో ఇలాంటి పరిస్థితి ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నేరాలు తగ్గాయి. గతేడాదితో పోల్చితే.. ఓవరాల్ క్రైం రేట్ 5.2 శాతం తగ్గింది. కాని, మహిళలపై జరుగుతున్న దారుణాలు మాత్రం పెరిగాయి. ఏపీలో మహిళల హత్యలు ఏకంగా 20 శాతం పెరిగాయి. సో, రాష్ట్రం ఏదైనా, ప్రాంతం ఏదైనా.. మహిళలు, ఆడపిల్లలే అత్యంత జాగ్రత్తగా ఉండడం అవసరం అని చెబుతున్నాయి ఈ రిపోర్ట్స్. తెలుగు రాష్ట్రాల డీజీపీలైనా, కమిషనరేట్ల పరిధిలోని సీపీలు అయినా.. ఒకే ఒక్క విషయంపై 'డేంజరస్' సిగ్నల్స్ పంపుతున్నారు. ఎంత కంట్రోల్ చేస్తున్నా.. పేట్రేగిపోతున్న ఓ క్రైమ్ గురించి పదేపదే హెచ్చరిస్తున్నారు. అదే సైబర్ క్రైమ్.

తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న సైబర్ మోసాలు, అవి జరుగుతున్న తీరుపై డిటైల్డ్‌గా చూడండి..

'గోల్డెన్ అవర్' గురించి తెలుసా. ప్రమాదం జరిగిన గంటలో ఆస్పత్రికి తీసుకెళ్తే ప్రాణాలు నిలబడే ఛాన్సెస్ ఎక్కువగా ఉంటాయి. అలాగే.. నేరాల్లోనూ 'గోల్డెన్ అవర్' వచ్చేసింది. మరీ ముఖ్యంగా సైబర్ నేరాల్లో. ఈ సైబర్ నేరాల స్థాయి గురించి, తీవ్రత గురించి ఎంత చెప్పినా తక్కువే. సపోజ్.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధినే తీసుకుందాం. ఇక్కడ ఈ ఏడాది నమోదైన సైబర్ నేరాల సంఖ్య.. 4వేల 42. ప్రజల నుంచి అన్యాయంగా కాజేసిన సొమ్ము 296 కోట్ల రూపాయలు. అమాయకుల నుంచి 296 కోట్లు కాజేస్తే.. అందులోంచి రికవరీ చేసింది జస్ట్ 42 కోట్లు మాత్రమే. అంటే.. రోజుకు 11 మందిని నిలువునా మోసం చేసి, డబ్బు కాజేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. హైదరాబాద్‌లో.. అందులోనూ ఒక్క కమిషనరేట్ పరిధిలోనే రోజుకు 11 మంది మోసపోతుంటే.. ఇక హైదరాబాద్‌లో, తెలుగు రాష్ట్రాల్లో సైబర్ నేరాల తీవ్రత ఎంత ఉంటుందో ఊహించుకోండి. అందుకే.. డీజీపీల నుంచి సీపీల వరకు ప్రతి ఒక్కరూ డేంజర్ సిగ్నల్ పంపుతున్నది ఈ సైబర్ నేరాల గురించే.

ఇక సైబరాబాద్ కమిషనరేట్ అయితే.. సైబర్ నేరాల్లో టాప్‌లో ఉంది. ఏకంగా 11వేల 914 మంది మోసపోయారు. ఈ ఏడాది నవంబర్ వరకు 793 కోట్ల రూపాయలు దోచేశారు. చాలా కేసుల్లో కేటుగాళ్లను పట్టుకున్నారు కూడా. కాని, 793 కోట్లు దోచేస్తే ఎంత రికవరీ అయిందో తెలుసా. 70 కోట్ల 46 లక్షల 11వేల 458 రూపాయలు. ఇక.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలు.. గతేడాదితో పోలిస్తే 57 శాతం పెరిగాయి. ఈ ఏడాదిలో 4వేల 458 కేసులు రిజిస్టర్ అయ్యాయి. నేరస్తుల ఖాతాల్లోని 23 కోట్లు మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మరో 22 కోట్ల రూపాయలు రిఫండ్ చేశారు. అందుకే, 'గోల్డెన్ అవర్' గురించి ప్రత్యేకంగా చెబుతున్నది. సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయామని తెలిసిన వెంటనే కంప్లైంట్ చేయడం మరిచిపోకూడదు. అలాగని డబ్బు పోగొట్టుకున్న గంటలోనే కంప్లైంట్ చేస్తే.. పోయిన సొమ్ము తిరిగొస్తుందన్న గ్యారెంటీ ఏం లేదు. వస్తే అదృష్టం.. అంతే. ఇక ఆంధ్రప్రదేశ్‌లో సైబర్ నేరాలు 34 శాతం పెరిగాయి. 916 మంది నుంచి ఒకవేయి 229 కోట్ల రూపాయలు కాజేశారు సైబర్ కేటుగాళ్లు. మరి ఎంత రికవరీ అయింది అని అడగకండి.. ప్లీజ్. చెప్పుకోవడం కూడా అనవసరం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఆరు నెలల్లోనే ఫోన్ ద్వారా ఏకంగా 25వేల ఫిర్యాదులు అందాయి. అంటే.. రోజుకు 133 మంది తాము మోసపోయాం, డబ్బులు పోగొట్టుకున్నాం అంటూ కంప్లైంట్స్ చేశారు. ఇది కేవలం ఆరు నెలల డేటా మాత్రమే. దోపిడీలు, దొంగతనాలతో 80 కోట్లు పోగొట్టుకుంటే.. సైబర్ నేరాల్లో అంతకంటే ఎక్కువ పోగొట్టుకున్నారు. ఇది వరకు జేబులు కత్తిరించేవాళ్లు, బెదిరించి దారిదోపిడీలు చేసే వాళ్లు ఎక్కువగా ఉండేవాళ్లు. ఇప్పుడందరూ ఫోన్‌పేలకు అలవాటు పడడం, పోలీసుల రెక్కీ కూడా పెరగడంతో.. ఇంట్లో ఉంటున్న వారిని ఇంట్లోనే దోచేస్తున్నారు. జస్ట్ లింక్ పంపించడమో, ఓటీపీ చెప్పమనడమో, కేసులు నమోదయ్యాయని బెదిరించడమో.. ఇలాంటి పనులతో జస్ట్ ఫోన్ ద్వారానే వేల కోట్లు దోచేస్తున్నారు. ఈమధ్య డిజిటల్ అరెస్టులు విపరీతంగా పెరిగాయి. మీపై కేసు నమోదైంది.. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే మేం చెప్పింది చేయాలంటూ దోచేస్తున్నారు. లేదా.. 'మీ అమ్మాయి లేదా అబ్బాయిని, లేదా ఫ్యామిలీలో ఒకరిని కిడ్నాప్ చేశామంటూ కాల్ చేసి, వాళ్లు చెప్పిన పని చేసేలా చేసి.. డబ్బు కాజేస్తున్నారు. ఆ లెక్కన.. సైబర్ నేరగాళ్లు ఒక్క తెలంగాణలో ఎంత దోచేశారో తెలుసా. అటుఇటుగా 2వేల కోట్ల రూపాయలు. చిన్నపాటి ప్రాజెక్టే కట్టేయొచ్చు ఆ డబ్బుతో. సైబర్ నేరాలపై ఎంత అవగాహన పెంచుతున్నారో.. అంతకంటే ఎక్కువ తెలివిమీరుతున్నారు మోసగాళ్లు. ఒకసారి ఈ నెంబర్స్ వినండి. సైబర్ నేరగాళ్లు తెలంగాణలో గతేడాది 778 కోట్లు లూటీ చేస్తే.. ఈ ఏడాది 1867 కోట్లు దోచేశారు. అంటే.. ఒకవేయి 88 కోట్లు లాస్ట్ ఇయర్ కంటే ఎక్కువ కాజేశారు. ఎలా మోసం చేస్తారు వీళ్లంతా అంటే.. ఆ పద్ధతులన్నీ చెప్పడానికి ఒక్క ఎపిసోడ్ సరిపోదు. పోలీసులు చెప్పిన దాని ప్రకారం.. ఇప్పటి వరకు తేలిన లెక్క ప్రకారం.. 34 పద్ధతుల్లో అమాయకులను బోల్తా కొట్టించారు. రాబోయే రోజుల్లో సరికొత్త పద్ధతుల్లో మోసం చేస్తారు. కాకపోతే.. బిజినెస్ ఇన్వెస్టిమెంట్, స్టాక్స్, పార్ట్‌టైమ్ జాబ్స్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ కస్టమర్ సర్వీసెస్, డెబిట్-క్రెడిట్ కార్డ్స్.. వీటి రూపంలో ఎక్కువగా మోసాలు జరుగుతున్నట్టు తేల్చారు. మరో విషయం.. చదువురాని వాళ్లనే మోసం చేస్తారని పొరబడుతుంటారు చాలామంది. బాగా చదువుకున్న వాళ్లు, మంచి జీతం-మంచి ఉద్యోగం చేస్తున్నవాళ్లను కూడా టార్గెట్ చేస్తున్నారు. అసలు వాళ్లూవీళ్లు అని లేదు. ప్రైవేట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు.. ఇలా ప్రతి ఒక్కరినీ మోసం చేస్తున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్.. ఈ ఏడాది జరిగిన సైబర్ నేరాల వివరాలు బయటపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 14వేల 174 ఫిర్యాదులు అందినట్టు షాకింగ్ డిటైల్స్ చెప్పారు. సైబరాబాద్ రీజియన్‌లో 25వేల 112 కంప్లైంట్లు, హైదరాబాద్ రీజియన్‌లో 20వేల 229, రాచకొండ పరిధిలో 14వేల 815, వరంగల్ పరిధిలో 3వేల 531, సంగారెడ్డిలో 3వేల 132 కేసులు నమోదైనట్టు చెప్పారు. ఏడాదికి లక్షకు పైగా కంప్లైంట్లు వస్తున్నాయంటే.. ఎంత మంది, ఎన్ని ముఠాలు మీ ఖాతాలోని డబ్బుల కోసం కాచుకుని కూర్చున్నారో అర్థం చేసుకోండి. వాట్సాప్ డీపీల్లో మీకు తెలిసిన వారి ఫొటో పెట్టేసి.. అర్జెంట్‌గా డబ్బులు కావాలని వాట్సాప్ చేస్తారు. మోసాల్లో ఇదో రకం. మీరు ఊహించలేని మోసం. మీ పేరు మీద కొరియర్ వచ్చిందంటారు, ఫేక్ మెసేజ్‌లు పెడతారు, నకిలీ లింక్‌లు పెడతారు, కస్టమర్ కేర్ అంటూ కాల్ చేస్తారు, ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో ఊరించి కాజేస్తారు, ఓటీపీలు, సోషల్ మీడియాలు, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ అంటూ వీలైనన్ని పద్ధతులు ప్రయోగించి దోచేస్తున్నారు కేటుగాళ్లు. సో, వచ్చే ప్రతి అనౌన్ కాల్, ప్రతి మెసేజ్, ప్రతి వాట్సాప్.. అన్నింటినీ అనుమానించడం అలవాటు చేసుకోండి. సినిమా హీరోలు, డైరెక్టర్లు, సెలబ్రిటీలతో చెప్పించే అవగాహన కార్యక్రమాలను ఒక్కసారి చూడండి. ఎలా మోసం చేయొచ్చో కొన్ని ఉదాహరణలతో చెబుతుంటారు. అవన్నీ కచ్చితంగా వినండి. ఇంత చేసినా.. మోసపోరు అనే గ్యారెంటీ లేదండోయ్. కేటుగాళ్లు కొత్త రూట్ వెతుక్కుని మరీ వస్తారు. సో, అనుక్షణం అలర్ట్‌గా ఉండడం ఒక్కటే మీ డబ్బుకు శ్రీరామరక్ష. ఇప్పటి వరకు మనం తెలుగు రాష్ట్రాల గురించే చెప్పుకున్నాం. కాని, దేశవ్యాప్తంగా ప్రతి సెకనుకు 11 సైబర్ నేరాలు జరిగాయి తెలుసా ఈ ఏడాది మొత్తంలో. ఈ లెక్కన వచ్చే ఏడాది ఎలా ఎంత భీకరంగా ఉండబోతోందో ఊహించుకోండి. నెక్స్ట్ ఇయర్ నుంచి సరికొత్తగా సైబర్ దాడులు చేయొచ్చని 'ఇండియా సైబర్ థ్రెట్ రిపోర్ట్' ఓ వార్నింగ్ ఇచ్చింది. రాబోయే రోజుల్లో ఎలా మోసం చేస్తారో తెలుసా వీళ్లు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకుని దొరికినంత దోచేయబోతున్నారు. ఈ టైప్ మోసగాళ్ల మెయిన్ టార్గెట్ ఎవరో.. కనీసం అంచనా కూడా వేయలేరు. ఛాలెంజ్. ఇంతకీ, నెక్స్ట్ టార్గెట్ అయ్యేది ఎవరో తెలుసా. ప్రభుత్వాల నుంచి పథకాలు అందుకుంటున్న వాళ్లే. 'ఇదిగో మీకు పెన్షన్ పెరిగింది, మీకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చింది, ఫలానా పథకానికి సంబంధించి డబ్బులు పడ్డాయి'.. ఇలా ఒక్కో పేరు చెప్పి దోచుకోబోతున్నారట. అచ్చంగా ప్రభుత్వ యాప్‌లే అని అనిపించేలా నకిలీ యాప్‌లు తయారు చేసి, వాటి ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. నట్టేట ముంచడానికి సిద్ధమవుతున్నారనే వార్నింగ్స్ వస్తున్నాయి. అంతటితో ఆగడం లేదు వీళ్లు. ఏకంగా పర్సనల్ లైఫ్‌లోకి కూడా ఎంటర్ అవడానికి రెడీ అవుతున్నారు. మీ డిజిటల్ రికార్డులు.. అంటే వేలిముద్రలు, కనుపాపలు ఎక్కడో అక్కడ రికార్డ్ అయి ఉంటాయి. వాటి సాయంతో దోచేయబోతున్నారు. లేదా ఆధార్- పాన్- బ్యాంక్ అకౌంట్ కాపీలను ఎవరో ఒకరికి షేర్ చేసి ఉంటారు కదా. వాటిని కలెక్ట్ చేయబోతున్నారు. లేదా మీ ఫోన్‌లోకే చొరబడి సేకరిస్తారు. వాటి ద్వారా మీ అకౌంట్లు మొత్తం ఖాళీ చేస్తారు. ఈసారి సామాన్యులనే కాదు.. ఏకంగా కంపెనీలను బోల్తా కొట్టించడానికి రెడీ అవుతున్నారట. మెయిన్‌గా హెల్త్‌కేర్, ఫైనాన్స్, ఆతిథ్య రంగాలకు సంబంధించిన కంపెనీలను దోచేందుకు ప్లాన్ చేస్తున్నారని డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెక్‌రైట్ అనే సంస్థలు ఓ నివేదిక విడుదల చేశాయి. సో.. రాబోయే కాలం అంతా సైబర్ నేరగాళ్లదే. ఆదాయం 14, రాజపూజ్యం 14 అన్నట్టుగా వాళ్ల ఆటలు సాగబోతున్నాయి. సో, బీ అలర్ట్. ఈ ఒక్క ముక్క చెప్పడం మినహా.. ఇచ్చే సలహా కూడా ఏం లేదు.

# ఏపీలో మరో భారీ ప్రాజెక్టు... చంద్రబాబు సమీక్ష

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో నీటిపారుదల శాఖ పై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి... రాష్ట్రాన్ని 100 శాతం కరువు రహిత రాష్ట్రంగా మార్చేందుకు భారీ ప్రణాళికలను అమలు చేయాలని నిర్ణయించారు. ఒకవైపు పోలవరం పూర్తి చేయడం ద్వారా 8 ఉమ్మడి జిల్లాలకు మేలు జరుగుతుందని, పోలవరంతో ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు కూడా లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు తెలిపారు. గోదావరి నదిలో వరదల సమయంలో సరాసరి ఏటా 2 నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలుస్తోందని, ఈ నీటి నుంచి 280 టీఎంసీలను వరదల సమయంలో తీసుకోవడం ద్వారా... కృష్ణా డెల్టాకు, రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు సహా ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లబ్ధి చేకూర్చేందుకు కార్యచరణ తీసుకువస్తున్నట్టు వివరించారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు గోదావరి నీటిని బనకచర్లకు తరలించడమే మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అటు పోలవరం, ఇటు ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు


ప్రాజెక్టు వివరాలు

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా విస్తృత స్థాయిలో రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, పరిశ్రమలకు మేలు జరగబోతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు కొత్తగా సాగునీరు అందుతుంది. దీనితో పాటు 22.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. పరిశ్రమలకు దాదాపు 20 టీఎంసీల నీటిని వినియోగించవచ్చు. దీని కోసం రెండు మూడు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గోదావరి నీటిని కృష్ణా నదికి తరలిస్తారు. కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. 200 టిఎంసిల సమర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మిస్తారు. అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటికి తరలిస్తారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు 31 కి.మీ టన్నెల్ ద్వారా నీటిని తరలిస్తారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ, %ూ=దీజ%, నిప్పుల వాగుకు నీళ్ళు వెళుతుంటాయి. నిప్పుల వాగు ద్వారా సోమశిల, కండలేరుకు నీటిని తరలిస్తారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని వివిధ లిఫ్టులు, కాలువల ద్వారా అన్ని ప్రాజెక్టులకు తరలిస్తారు.

కేంద్ర ఆర్థిక సాయానికి ప్రయత్నాలు

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రాజెక్టు చేపట్టడం అంత సులభం కాదు. అయితే ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఇదే పెద్ద గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.70 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలుస్తోంది. 54 వేల ఎకరాల భూ సేకరణ జరపాల్సి ఉంటుంది. 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. పెద్ద మొత్తంలో ఫారెస్టు భూములు కూడా సేకరించాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే భారీ వ్యయం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వ్యయం చేసే అవకాశం లేదు. దీంతో ఈ ప్రాజెక్టు అవసరాన్ని, ప్రయోజనాలను కేంద్రానికి వివరించిన ముఖ్యమంత్రి కేంద్ర సాయం కూడా తీసుకుని దీన్ని పూర్తి చెయ్యాలని భావిస్తున్నారు. ఈ వారంలో జరిగిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర పెద్దలతో ఈ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రాజెక్టు అవసరాన్ని వివరించి ఆర్థిక సాయంపై విన్నవించారు.

# బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఆసక్తికరంగా రాజకీయం



ఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు స్మారకం నిర్మాణం విషయంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయం ఆసక్తికరంగా మారింది. రెండు పార్టీ నేతలు ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోనియా గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మాజీ ప్రధాని మన్మోహన్‌కు స్మారకం నిర్మించడంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు పరస్పర విమర్శలు చేసుకున్నారు. మన్మోహన్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని, స్మారకం నిర్మించే ప్రాంతంలో కాకుండా నిగంబోధ్‌లో అంత్యక్రియలు నిర్వహించిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఆరోపణలపై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్పందిస్తూ.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై సంచలన ఆరోపణలు చేశారు. తాజాగా జేపీ నడ్డా మాట్లాడుతూ..'మన్మోహన్ మృతితో విషాదం నెలకొన్న సమయంలోనూ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మన్మోహన్ స్మారకం కోసం స్థలాన్ని కేటాయించింది. ఆ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు కూడా తెలియజేశాం. మన్మోహన్ ప్రధానిగా ఉండగా.. సోనియా గాంధీ సూపర్ ప్రధానిగా వ్యవహరించి ప్రధాని పదవిని అవమానించారు. ఒక ఆర్డినెన్స్‌ను చించేయడం ద్వారా మన్మోహన్‌ను రాహుల్ గాంధీ కూడా అవమానించారు. అదే కాంగ్రెస్ ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో పీవీ అంశంపై కూడా నడ్డా స్పందించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ..'పీవీ నరసింహారావు స్మారకం నిర్మించడానికి సోనియా గాంధీ అంగీకరించలేదు. కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచడానికి కూడా ఆమె అనుమతించలేదు. చివరకు ఆయన అంత్యక్రియలను ఢిల్లీలోని నిర్వహించనీయలేదని ధ్వజమెత్తారు. అలాగే, 2015లో పీవీ కోసం ప్రధాని మోదీ స్మారకం ఏర్పాటు చేశారని, భారత రత్న కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రణబ్ ముఖర్జీ మరణించినప్పుడు కాంగ్రెస్ పార్టీ కనీసం సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో, ఆయన కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి.

# తిరుమల దర్శనం...

అమరావతి: తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబుతో తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ (టీటీడీ) బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులను కూడా అంగీకరించాలని ఇటీవల తెలంగాణకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్... ఏపీ సీఎంతో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖపై చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలకు చంద్రబాబు అంగీకారం తెలిపారు. రెండు బ్రేక్ దర్శనం, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలను అనుమతించేందుకు సీఎం అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సు లేఖలను అంగీకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు.

# రీయంబర్స్ మెంట్ కోసం విద్యార్థుల సమరశంఖారావం గోడప్రతుల ఆవిష్కరణ

### నీల నాగరాజ్,బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్): జిల్లా కేంద్రంలో బీసీ బాలుర వసతిగృహంలో జరిగిన సమావేశంలో జనవరి 8న ఇందిరా పార్క్ వద్ద జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం గోడప్రతులు ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి సుమారుగా 4,500 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థుల కు ఏ విధంగా అయితే స్కాలర్షిప్లు విడుదల చేస్తున్నారో బీసీ విద్యార్థులకు కూడా ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.బీసీ గురుకులకు, సంక్షేమ వసతి గృహాలలో సొంత భవనాలు నిర్మించాలి మరియు మౌలిక సదుపాయాలు కల్పించాలి.ప్రైవేటు యూనివర్సిటీలలో రిజర్వేషన్లను అమలు చేయాలి.పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్లు మంజూరు సంఖ్యను పెంచాలి.హైదరాబాదులో 10 ఎకరాలలో పూలే నాలెడ్జ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలి.ఫీజులు,స్కాలరుషిప్లు,మెస్ చార్జీల నిధులు ప్రతీ 3 నెలలకు ఒకసారి గ్రీన్ చానల్ ద్వార విడుదల చేయాలి.ప్రయివేట్ యూనివర్సిటీ లలో కూడా సామాజిక రిజర్వేషన్లు అమలుచేయాలి.ఇంటర్,డిగ్రీపీజీ,ఇతర వృత్తి విద్యా కోర్సుల కామన్ ఫీజునుపెంచాలిఅనిఅన్నారు.బడుగు,బలహీన వర్గాలు విద్యార్థుల ఫీజుల సమస్యలు,సంక్షేమ వసతి గృహాల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం పెద్ద ఎత్తున తరలివచ్చి బీసీ విద్యార్థుల సమర శంఖారావాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనంతుల సాయి గౌడ్,బీసీ విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాస్, హరి, వెంకటేష్, ప్రసాద్, రమేష్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వి హెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ లీడర్ వ్యాల హరీష్ రెడ్డి నాయకత్వంలో రామగుండం గడ్డమీద బిఆర్ఎస్ జెండాను ఎగర వేస్తాం



రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి, (శుభోదయం న్యూస్): స్థానిక గంగనగర్ స్వాగత్ ఫంక్షన్ హాల్ లో రామగుండం నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొని రామగుండంనియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ లీడర్ వ్యాల హరీష్ రెడ్డి అన్న నాయకత్వంలో రామగుండం గడ్డమీద బిఆర్ఎస్ జెండాను ఎగర వేస్తాం అని బిఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో విఫలమైంది కాబట్టి రాబోయే అసెంబ్లీ ఎలక్షన్ లో వి హెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిఆర్ఎస్ ఎన్ఆర్ఐ లీడర్ వ్యాల హరీష్ రెడ్డి అన్న నాయకత్వంలో రామగుండం గడ్డమీద బీఆర్ఎస్ జెండాను ఎగర వేస్తాం నాయకులు కార్యకర్తలు సమావేశంలో దీమా వ్యక్తం చేయడం జరిగింది వ్యాల హరీష్ రెడ్డి అన్ననాయకత్వంలోరామగుండంనియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ కీ పూర్వ వైభవం తీసుకొస్తాం అలాగే ప్రతి డివిజన్ లో ప్రతి గ్రామాల్లో వ్యాల హరీష్ రెడ్డినాయకత్వాన్నిబలపరుస్తాము. రామగుండంనియోజకవర్గంలో గడిచిన సంవత్సర కాలంగా కాంగ్రెస్ పార్టీ విధ్వంసాలు తప్ప చేసిన అభివృద్ధి శూన్యం. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులతో ప్రారంభించిన పనులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏమీ లేదు కాంగ్రెస్ పార్టీ మన ప్రాంతానికి ఒక్క పైసా నిధులుతీసుకురాలేదు.కాంగ్రెస్ పార్టీ నాయకులు మాటలతో కోటలు కడుతున్నారు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు వ్యాళ్ల హరీష్ రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది పేద వాళ్ళను సహాయం అందజేశారని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి జాహిద్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తోడేటి శంకర్ గౌడ్, పొలాడి శ్రీనివాస రావు, బొబ్బిలి సతీష్, వంశీకృష్ణ, మామిడాల రాము, గోపి, నూతి రాజ్ కుమార్, కొండ సురేష్, పోయిల రవి, ఖాజా, పిడుగు కుమార్, షఫీ, కదర్ల శ్రీధర్, మధు, తదితరులు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలకు ప్రజా ప్రతినిధులే భాధ్యత వహించాలి సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే. కనక రాజ్







రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి,(శుభోదయం న్యూస్): గోదావరి నది పై ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలోఅధికారులు అలసత్వంవహిస్తున్నారని ,గోదావరి నది లో జరుగుతున్న ఆత్మహత్యలకు ప్రజా ప్రతినిధులే భాధ్యత వహించాలని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే.కనక రాజ్ అన్నారు.గోదావరి నది లో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సిపిఐ అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పటికిని పాలకులు అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వలన ఆహ్లాదకరంగా ఉన్న గోదావరి నది ఆత్మహత్యలకు నిలయంగా మారిందని కనకరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో నీటిని నిల్వ ఉంచడం వల్ల గోదావరి నది కలుషితంగా మారి ప్రజలు అనేక అవస్థలుపడ్డారని,మంచినీటి కోసం ఇబ్బందులు ఎదుర్కున్నారని, నిండుకుండలా మారిన గోదావరిలో అనేకమంది దూకి ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరమని, మేడిగడ్డ డ్యామ్ నిర్మాణంలో లోపాలు ఉండడం వల్ల స్టోరేజి నీటినంతటిని వదిలివేశారని స్వచ్ఛమైన నీరువస్తున్నప్పటికిని నీటిమట్టం తగ్గినప్పటికిని ఆత్మహత్యలు మాత్రం ఆగకుండా పెరుగుతున్నాయని అన్నారు.రామగుండంపారిశ్రామిక ప్రాంతంలో అనేకకర్మాగారాలు ఎన్ టి పి సి,ఆర్ ఎఫ్ సి ఎల్,సింగరేణి,సంస్థ,రామగుండం నగరపాలక సంస్థ ఎవరు కూడా గోదావరి నదిపై ఫెన్సింగ్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆత్మహత్యలుజరుగుతున్నాయని తెలిపారు. అనేక మంది గోదావరి నది లో దూకి చనిపోయినప్పటికి ప్రజాప్రతినిధులకు గానీ అధికారులకు గానీ చీమకుట్టినట్లైన లేకపోవడం విచారకరమని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో గోదావరి నదిపై పెన్సింగును ఏర్పాటు చేయాలని పోరాటకార్యక్రమాలునిర్వహిస్తున్నప్పటికిని అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టుగాఉంటున్నారని ఇదివిచారకరమని అన్నారు. గోదావరి నదిలో దూకి సత్యనారాయణ అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమని ఇంకా ఎంతమంది చనిపోతే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారని ఆయన ప్రశ్నించారు.ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి పెన్సింగ్ ను ఏర్పాటుచేయాలని లేని యెడల సిపిఐ పక్షాన పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# నిరంతరం శ్రమిస్తున్న.. కార్మిక యువ నాయకుడు.. హరి ప్రసాద్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (స్టాఫ్ రిపోర్టర్) (కొమ్ము శ్రీనివాసరావు) (శుభోదయం న్యూస్) : కార్మిక నాయకునిగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి తనదైన విలువలను పాటిస్తూ కార్మికుల విలువలను పెంచుతూ. నిరంతరం శ్రమిస్తున్న ఐ .టి. సి.( బి .పి .యల్ )గుర్తింపు సంఘం. టి .ఎన్. టి. యు సి. యువ నాయకుడు. కనకమెడల హరి ప్రసాద్ 2025. సంవత్సరంలో జనవరి నెలలో జరగనున్న కార్మిక ఎన్నికలకు. ఆయన సన్నద్ధమైనారు. కార్మికులకు గాని వారి కుటుంబ సభ్యులకు గానీ. వ్యక్తిగతంగా గాని. ఆరోగ్యపరమైన ఏ ఇతర సమస్యలు వచ్చిన పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కనకమెడల హరి సేవలను కార్మికులు కొనియాడుతున్నారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులతో పాటు. బయట అణగారిన ప్రజలకు తన వంతు సహాయ సహకారాలతో పాటు. నిరంతరం తన పరిధిలో సేవలుచేసుకుంటూ వస్తున్నారు. బి.పి.ఎల్. కంపెనీలో ఆన్ టైం వేతన ఒప్పందం చేసి. రిటైర్మెంట్ అయిన కార్మికులకు నష్టం జరగకుండా కార్మికుల వెన్నంటి ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తూ వారి ఆరోగ్య సమస్యల పట్ల కూడా తమ వంతు సహాయ సహకారాలు . అందించడంలో. కనకమెడల హరిప్రసాద్ ముందడుగులో ఉన్నాడు. గతంలో జరిగిన కార్మిక ఎన్నికల్లో విజయం సాధించిన యువ నాయకుడు హరిప్రసాద్. కార్మికుల అనేక రకాల సమస్యలను పరిష్కరించడంలో యజమాన్యంతో గట్టిగానే పోరాడి పరిష్కారం దిశగా ప్రయాణించి. కార్మికుల గుండెల్లో చెరగని మంచిని సంపాదించుకున్నాడు. మన సారపాక గ్రామంలో పుట్టి పెరిగి. చదువుకొని కార్మిక నాయకునిగా ఎదిగినటువంటి. కనకమెడల హరిప్రసాద్. రాజకీయాలకు. కులాలకు. మతాలకు అతీతంగా నేనున్నానని భరోసా ఇస్తూ కార్మికుల మెచ్చిన నాయకుడిగా ఆయనకు. తగిన గుర్తింపు దక్కింది. 2025. జనవరి నెలలో జరగనున్న కార్మిక సంఘపు ఎన్నికలలో మన ఆత్మీయ కార్మిక నాయకున్ని మరోసారి గెలిపించుకోలని. అన్ని వర్గాల కార్మికులు ఎదురుచూస్తున్న తరుణంలో ఆయన ఎన్నికల రంగానికి సిద్ధం కావడంతో కార్మికులలో ఉత్తేజం నిండింది. అధికారం ఉన్న లేకపోయినా నిరంతరం కార్మికులకు అందుబాటులో ఉంటున్న. (టి .ఎన్. టి యు. సి) గుర్తింపు కార్మిక సంఘం యువ నాయకుడు. కనకమెడల హరి ప్రసాదును గెలిపించుకొని మెరుగైన 14వ వేతన ఒప్పందంలో అన్ని వర్గాల కార్మికులకు. మేలు జరిగే విధంగా ఉండాలంటే ఇలాంటి యువ నాయకుడి నాయకత్వం ఎంతో అవసరమని కార్మికులు భావిస్తున్నారు.

# లెజండ్ తో ఫైర్ బ్రాండ్ భేటీ



ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో పామూరు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు టిడిపి యువ నాయకులు జిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం కార్యదర్శి మెంటా నరసింహారావు భేటీ అయ్యారు. ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పై వారిరువురు చర్చించినట్లు తెలుస్తోంది. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని డాక్టర్ ఉగ్ర సూచించినట్లు మెంటా తెలిపారు.

# టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించిన కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ



ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పామూరు మండలంలో మొట్టమొదటి గా స్వీకరించి నియోజకవర్గంలోని యువతకు ఆదర్శంగా నిలిచిన టిడిపి యువ నాయకులు కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు.

## యారవను అభినందించిన డాక్టర్ ఉగ్ర



పామూరు మండలంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించిన యారవ శ్రీనివాసులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా యారవ మాట్లాడుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు సానుభూతిపరులు టిడిపి సభ్యత్వం స్వీకరించాలని తద్వారా కుటుంబాలకు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన తెలిపారు

# శానం రమణయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కదిరి పార్థసారథి



ప్రకాశం జిల్లా బ్యూరో– చంద్ర (శుభోదయం న్యూస్): ప్రముఖ వ్యాపారవేత్త బాబు పెరల్స్ అధినేత హరీష్ శానం తండ్రి శానం రమణయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమం కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని సుజాత రెసిడెన్సిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన కదిరి విద్యాసంస్థల కరస్పాండెంట్ కదిరి పార్థసారథి మరియు పలువురు రాజకీయ నాయకులు, పలువురు పట్టణ ప్రముఖులు.

# సచివాలయాలలో కుల గణన జాబితాను పరిశీలించండి

### ఎమ్మార్పీఎస్ నాయకులు మాసిపోగు బాబు



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు మాసిపోగు బాబు, రావినూతల కోటయ్య ఆధ్వర్యంలో కనిగిరి మండలంలోని కుల గణన పై అవగాహన కలిగించడానికి పలు గ్రామాలలో సోమవారం ఉదయం 6గంటల నుంచి కనిగిరి మండలంలోని తుమ్మగుంట, చల్లగిరిగిల, కాశిరెడ్డి కాలనీ పలు సచివాలయా లలో కులగణన జాబితాలను పరిశీలించారు. కనిగిరి చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న తోటి మాదిగల తో కుల గణన గురించి అవగాహన కలిగించారు. అందరూ కుల గణన జాబితా ప్రతి సచివాలయంలో వచ్చి ఉన్నది ఆ సచివాలయంలో మీ పేర్లు మీ యొక్క కులము హిందూ మాదిగ ఉందా లేదా చూసుకొని కొన్ని కొన్ని చోట్ల కులాలు మారినాయి. క్రిస్టియన్లుగా



నమోదై ఉన్నవి.కనుక సోమవారం ఉదయాన్నే మీ యొక్క కులం సర్టిఫికెట్ తీసుకెళ్లి స్థానిక సచివాలయాల్లో మార్పులు చేర్పులు చేసుకొని గౌరవనీయులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మన ఎస్సీ వర్గీకరణ అంతిమ లక్ష్యానికి సిద్ధంగా ఉండాలని కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మార్పీఎస్ నాయకులు, రావినూతల కోటయ్య, కనిగిరి మండల మరియు పట్టణ అధ్యక్షులు మాసి పోగు బాబు బాబు కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు మాసిపోగు బాబు మాదిగ, ఇంటూరి కిరణ్ మాదిగ, పాల్గొన్నారు.

# చెరువు అలుగు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి, రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):కనిగిరి పెద్ద చెరువు నుంచి కొత్తూరు వద్దకు గల అలుగు వాగును రెవిన్యూ, మునిసిపల్, ఇరిగేషన్ అధికారులతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు.అలుగు ఆక్రమణ దృష్ట్యా అధికారులు తో రెవిన్యూ రికార్డ్స్ ను పరిశీలించారు.గత నెలలో భారీ వర్షం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైన దృష్ట్యా మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు.అలుగు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా అవసరమైతే కేసులు పెట్టాలని ఆదేశించారు.అలుగు వాగు సర్వే చేసి రికార్డ్స్ మేరకు సరి చేయాలన్నారు. అప్పటి వరకు నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని అధికారులకు ఆదేశించారు.అనంతరం నిర్మాణం జరుగుతున్న హైవే పనులను కూడా పర్యవేక్షించారు.అక్కడ జరుగుతున్న పనితీరును హైవే ఇంజనీర్ తో మాట్లాడారు త్వరిగతిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఆయనతోపాటు మునిసిపల్ కమీషనర్ డేనియల్ జోసెఫ్, తహసీల్దార్ అశోక్ కుమార్, ఇరిగేషన్ రామకృష్ణ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఎస్సీ సోషల్ ఆడిట్ సమయాన్ని పొడిగించాలి దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు గోన దానయ్య



కనిగిరి, రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ సర్వే సమయాన్ని మరో 15 రోజులు పొడిగించాలని కోరుతూ కనిగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కేశవర్ధన్ రెడ్డి కి గ్రీవెన్స్ ద్వారా దళిత హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు గోన దానయ్య ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం పరిధిలోని సచివాలయాలలో ఎక్కడా కూడా ఎస్సీ సోషల్ ఆడిట్ పై ప్రజలకు అవగాహన కల్పించలేదని అన్నారు అదేవిధంగా ఈనెల 31 కి చివరి గడువు రోజు కావడంతో తప్పుగా కులం నమోదైన వారు సరి చేసుకునేందుకు వినతి పత్రాలు ఇచ్చేందుకు సమయం సరిపోదు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వారు శ్రీయుత కలెక్టర్ గారు సమయాన్ని మరో 15 రోజులు పొడగించాలని కోరారు అలానే గ్రామాల్లోని సచివాలయాలలో గ్రామ ప్రజల అవగాహన కొరకు పంచాయతీలలో దండోరా వేయించి ప్రజలకు సమాచారాన్ని అందించే విధంగా చూడాలని కోరారు స్పందించిన ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి సంబంధిత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.త

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన.....

### కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలి: వామపక్షాల డిమాండ్




రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్) : గోదావరిఖనిలో వామపక్షాల దేశవ్యాప్త నిరసనకార్యక్రమంలో భాగంగాభారత రాజ్యాంగ నిర్మాత నిమ్న కులాల ఆశాజ్యోతి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ పేదల బతుకులు మారడానికి హక్కులు కల్పించడానికి అనేక ప్రజాస్వామ్య విలువలను ఆత్మ గౌరవాన్ని పెంపొందించే విధంగా భారత దేశ రాజ్యాంగాన్ని నిర్మించి భారత ప్రజలకి దిక్సూచిలా తన స్వరంతో పేదలకు అండగా ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానిస్తూ దేవుడికి



మొక్కినపుణ్యముంటది అంబేద్కర్ కి మొక్కటం వల్ల ప్రయోజనం లేదని అనుచిత వ్యాఖ్యానాలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలోసోమవారం రోజున దేశవ్యాప్త పిలుపులో భాగంగా గోదావరిఖని మున్సిపల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వై.యాకయ్య సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తో కల రమేష్ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు ఐ క్రిష్ణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం జిల్లా కార్యదర్శి కే విశ్వనాథ్ పాల్గొని మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రాజ్యాంగ మీద వ్యతిరేకతతో ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నది దాని కుట్రలో భాగంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ అవమానపరిచే విధంగా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడాడు. ఒక్క క్షణం కూడా కేంద్ర మంత్రి పదవిలో ఉండే అర్హత అమిత్ షా కి లేదు. తక్షణమే బిజెపి ప్రభుత్వం కేంద్ర మంత్రిపై చర్యలు తీసుకొని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో వామపక్షాల నేతలు వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, ఈదునూరి నరేష్, తూళ్ళ శంకర్, ఎల్ భీమయ్య, ఏ. మహేశ్వరి, ఇనుగాల రాజేశ్వర్, ఈ.రాజేందర్, దామక లచ్చన్న, బిక్షపతి, నర్సయ్య,శివ,సతీష్, రాజయ్యసమీర్,శ్రీనివాస్,దీప,సుజాత,మహేశ్వరి,వాణి,అంజలి,కలువల రాయమల్లు, ప్రసాద్, గుండేటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజయ్ షెల్టర్స్ అభివృద్ధి కార్యక్రమాలు





మియాపూర్, (శుభోదయం న్యూస్): ప్రజయ్ షెల్టర్స్ అపార్ట్మెంట్ లో గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగక అపార్ట్మెంట్ వాస్తవ్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.సుమారుగా, 300 కుటుంబాల వరకు ఉన్న ఈ కాలనీ అపార్ట్మెంట్ వాసులను ఏ పార్టీ నాయకుడు కూడా పట్టించుకోవడం లేదు. అపార్ట్మెంట్ చుట్టుప్రక్కల కుక్కల వీరంగం దోమల బీభత్సం ఎక్కువ అవుతున్నది. కానీ ఏ నాయకులు కూడా ఎన్నికల ప్రచారానికి మాత్రం వచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పడమే గాని పనులను మాత్రం చేయడం లేదు. ఎన్నికల సమయంలో ఓట్ల గురించి వచ్చే అన్ని పార్టీల నాయకులు ఓట్లు మాత్రమే ముఖ్యము. అభివృద్ధి కార్యక్రమాలు వ్యర్థం అనే ధోరణిలో ఉన్నారు. ఇదే సమయంలో కాలనీలో ఏర్పడిన నూతన కమిటీ ఈ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినారు. ఇందులో భాగంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పనులను ప్రారంభించినారు. నూతనంగా ఎంపికైన ప్రజయ్ షెల్టర్స్ అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ శంకరాచారి వైస్ ప్రెసిడెంట్ జయమ్మ ఈ కార్యక్రమాన్ని చేపట్టి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రపరిచినారు. వారి యొక్క సత్తాను చూపినారు. అభివృద్ధి పనులను ఇంకా కొనసాగించడానికి కృషి చేస్తాము అని వెల్లడించారు

# కస్తూర్బా విద్యాలయానికి విద్యుత్ సామగ్రి వితరణ



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మిట్టగుడిపాడు కస్తూర్బా బాలికల విద్యాలయానికి స్థానిక ఎం ఎల్ ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు రూ. 86 వేల విలువైన విద్యుత్ సామగ్రిని సోమవారం వితరణ చేశారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం కారణంగా బాలికల చదువుకు ఆటంకం జరుగుతుండడంపై స్పందించిన ఎం ఎల్ ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు నాలుగు ఇన్వర్టర్ బ్యాటరీలు, యుపీఎస్ లను విద్యాలయానికి అందజేశారు. ఈ ఫౌండేషన్ గతంలో కూడా నాలుగు కంప్యూటర్లను అందజేసి బాలికల విలువైన చదువుకు తమ వంతు సహకారం అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్లు కల్యాణ్, నందగోపాల్ మాట్లాడుతూ ఇక్కడి ఉపాధ్యాయుల కోరిక మేరకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యాలయంలో ఇన్వర్టర్ల ఏర్పాటుతో బాలికల చదువుకు ఇక ఎటువంటి ఆటంకం ఉండదని భావిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ బాలినేని రాజకుమారి ఫౌండేషన్ సేవలను ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు జయంతి, కల్యాణి, అరుణ కుమారి, లత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యత మరువని గ్రామ మాజీ సర్పంచ్ కావిటి



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): అతను ఒక మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్. అతను తన పదవీకాలంలో పంచాయతీ అభివృద్ధికి కృషి చేసి పట్టణ ప్రజలమన్ననలు పొందారు. తనకు స్వార్థం తెలియదు, కక్ష రాజకీయాలు అసలే తెలియవు. అందరికీ సేవ చేయడమే ధ్యేయంగా పనిచేసి ఆనాటి నుంచి నేటి వరకు కావిటి సుబ్బయ్య అంటే పట్టణంలో తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. నేటికీ గ్రామ సమస్యలు తన కంటికి కనిపిస్తే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవడం కనిపిస్తుంది. ఆ క్రమంలో పట్టణంలో పారిశుద్ధ్య కార్మికునికి అండగా నిలిచి వ్యర్థాలను పరిశుభ్రం చేసే క్రమంలో కార్మికునికి సహకరిస్తున్న సందర్భంలో శుభోదయం జిల్లా బ్యూరో చంద్ర ఫోటో తీయడం జరిగింది. ఈ సందర్భంగా కావిటిని ప్రశ్నించగా ఇప్పటికీ ఎప్పటికీ సేవ చేస్తూనే ఉంటానని బదులిచ్చారు.

# కూలీ రేట్లు పెంచకుంటే మార్కెట్ ను స్తంభింపజేస్తాం

## హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నల్ల జెండాలతో హమాలీలు హోల్ సేల్ వ్యాపారుల నిర్లక్ష్యం పై నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన నిరసన కార్యక్రమం అనంతరం హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ మాట్లాడుతూ 2017 లో చేసిన ఒప్పందం ప్రకారం కూలీ రేట్లు 2019 వరకు చెల్లించేందుకు హోల్ సేల్ వ్యాపారులు ఒప్పందం చేసుకున్నారని, అట్టి ఒప్పందం ముగిసిన వెంటనే మరల కూలీ రేట్లు పెంచేందుకు ఒప్పందం జరగాల్సి ఉండగా, కరోనా పేరుతో హోల్ సేల్ వ్యాపారులు వాయిదా వేసారని ఆయన అన్నారు. ఐదు సంవత్సరాలు గడిచినా హమాలీలకు కూలీ రేట్లు పెంచడం లేదని, గత సంవత్సరం కూలీ రేట్లు పెంచాలని హోల్ సేల్ వ్యాపారుల కు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, ఐనా ఇప్పటి వరకు కూలీ రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ కు సమగ్ర వేతన చట్టం లేక అర్థాకలితో వారు అలమటిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా హోల్ సేల్ వ్యాపారులు స్పందించి కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, గాలిపెల్లి సతీష్, ఎం.డి.జానీమియా, కౌటం రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి ముసుగులో గురువుపై దాడి చేసిన మతోన్మాదులను కటినంగా శిక్షించాలి

### వేల్పుల కుమారస్వామి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ లోని ప్రభుత్వ పాఠశాల దళిత ప్రధానోపాధ్యాయులు రాములు గారిపై భక్తి ముసుగులో దాడి చేసిన మతోన్మాదులను కటినంగా శిక్షించాలని కోరుతూ ఈరోజు సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా, మండల,పట్టణ కేంద్రాల్లో నిరసనలకు పిలుపునివ్వడం జరిగింది.ఇందులో భాగంగా ఈరోజు గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర అంబేడ్కర్ చిత్ర పటాలు, నల్లజెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ గత 3,4 రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కు గూడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి తాడువుతున్న అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థినిని తరగతి గదిలోనిల్చోబెట్టినారని కొంత మంది అసత్యపు పోస్టులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో సుమారు 50 మంది అయ్యప్ప మాలలు ధరించి మరికొందరితో కలిసి వచ్చి గురువు రాములు గారిపై దాడి చేశారు రాములు గారు క్షమాపణ చెప్పినప్పటికీ అంతటి ఆగకుండా విద్యార్థి కాళ్ళు మొక్కించారు. దీంతో పాటు అక్కడున్న అయ్యప్ప మాలలు ధరించిన వారి కాళ్ళు కూడా మొక్కించడం జరిగింది. ఈ ఘటనను సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. గురువు దేవుడితో సమానం అంటారు కదా మరి ఆ దేవుడితో కాళ్ళు మొక్కించడం ఏంటని మతోన్మాదులను ప్రశ్నించారు.గతంలో కూడా నిజామాబాద్ జిల్లా వర్ని లో ఇలాంటి ఘటన జరిగిందని అక్కడకూడా విద్యార్థులకు శాస్త్రీయ భావాలు బోధిస్తున్నారు టీచర్ ను బయటికి తీసుకువచ్చి గుళ్ళోకి లాక్కెళ్లి బలవంతంగా దేవుడికి మొక్కించడం జరిగిందని అన్నారు.ఈ మధ్య కాలంలో పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గారు అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఇవన్నీ చూస్తుంటేబిజెపి,ఆరెస్సెస్ మూకలు కావాలనే దళితులపై, గురువులపై ఈ రకమైన దాడులకు తెగబడుతున్నదని అన్నారు. మతోన్మాదాన్ని దేశంలో పెంచి పోషిస్తుందని అన్నారు. మతోన్మాదుల ఆటలు సాగనివ్వమని అన్నారు. గురువులకు సీఐటీయూ అండగాఉంటుందని అన్నారు. భక్తి ముసుగులో గురువుపై దాడి చేసిన దుండగులను అరెస్టు కటినంగా శిక్షించాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.బిక్షపతి, నాయకులు శివకుమార్,సతీష్ కుమార్,రాజయ్య,శ్రీనివాస్,సమీర్,శివ, లక్ష్మణ్,పీర్ మహ్మద్,దీప,మహేశ్వరి, సుజాత,అంజలి,వాణి, రజిత,వరలక్ష్మీ,నర్సమ్మ,సరిత,భాగ్య లక్ష్మి,రాజ్య లక్ష్మి,రమ,రాము, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు ఆసరాగా నిలిచిన ఆనంద్ కృష్ణారెడ్డి



జిన్నారం, (శుభోదయం న్యూస్): వృద్ధాప్యం కారణంగా అనారోగ్యంతో మంచానికి పరిమితం అయిన భర్తతో నానా అగచాట్లు పడుతున్న ఓ వృద్ధిరాలి ఆవేదన విన్న బిజెపి బొల్లారం మున్సిపల్ ప్రెసిడెంట్ కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి చలించిపోయారు. పింఛను తీసుకునేందుకు వచ్చిన ఆ వృద్ధ మహిళ ఆవేదన విన్న ఆనంద్ కృష్ణారెడ్డి బొల్లారం మున్సిపల్ పరిధిలోని వెంకటరెడ్డి నగర్ లో నివసిస్తున్న ఆ వృద్ధ దంపతుల ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అనారోగ్యం కారణంగా మంచానికి పరిమితం అయిన రామకృష్ణ తో మాట్లాడి ఆయనకు భరోసా ఇచ్చారు. ఎలాంటి సమయంలో అయినా తాను ఎల్లవేళలా సహాయసహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా వారికి ఐదు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో తనకు విషయం చేరవేస్తే వాహనం సదుపాయం, అలాగే వైద్య సహాయం అందిస్తానని ఆయన ఆ వృద్ధ దంపతులకు హామీ ఇచ్చారు. దీంతో తమకు ఒక కొడుకుకన్నా ఎక్కువగా ఆప్యాయంగా పలకరించి తమకు సహకరించడంతో ఆనంద్ కృష్ణారెడ్డిని నిండుమనసుతో దీవిస్తూ ఆయన అందరికి ఇలా సాయం చేయాలని ఆకాంక్షించారు.

# ఎంటర్ పెన్యూర్ షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం





యాదాద్రి భువనగిరి జిల్లా, (శుభోదయం న్యూస్): రైట్స్ స్టెప్స్ ఫౌండేషన్ మరియు ఉదిత స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఇన్కమ్ జెనరేషన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్స్ అండ్ యూత్ కార్యక్రమంను యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లోని ఉదిత ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో రైతు సోదరా, సోదర మణులకు మరియు నిరుద్యోగ యువకులు మహిళలు కోసం భవిష్యత్తులో అధిక లాభర్జన కోసం స్వయం ప్రతిపత్తి ధ్యేయంగా సెల్ఫ్ యూనిట్స్ ఏర్పాటు కొరకు మూడు రోజులు ఉచితంగా ఈడీపీ (ఎంటర్ పెన్యూర్ షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం) శిక్షణను నిర్వహించడం జరిగిందని సంస్థ డైరెక్టర్ చేగూరి





రమణ వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సిఎచ్.చరణ్ సింగ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ యూనివర్సిటీ వారి నుండి శిక్షణ పొందిన 90 మందికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి రైట్ స్టెప్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్స్ బత్తిని.జ్ఞాన ప్రదీప్, సిరికొండ.రమేష్, కె.శ్రీనివాస చక్రవర్తి చేతుల మీదుగా (ఈ.డి.పి ) సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిరికొండ.రమేష్ మాట్లాడుతూ అగ్రికల్చరల్ రంగంలో సొంతంగా బిజినెస్ చేసుకోవడానికి స్థిరపడాలనుకునే వాళ్లకు సొంతముగా సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి అలాగే బ్యాంకర్ల రుణాలు పొందాలంటే ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు.పాశం. అలివేలుజనార్ధన్, సెంటర్ మేనేజర్. నవీన్, ట్రైనర్స్ పబ్బల. విజయ, బెల్లంకొండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అన్నా బత్తిన వెంకమ్మ జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణీ అన్నదానం...



ఒంగోలు, (శుభోదయం న్యూస్): అన్నాబత్తిన వెంకమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభాకర రావు ఘనశ్యామ్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో అనాధలకు యాచకులకు దుప్పట్లు పంపిణీతో పాటు భోజనం వసతి ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ కన్వీనర్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ అన్నాబత్తిన వెంకమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల




ఆధ్వర్యంలో చలికాలంలో ఏ దిక్కులేని పేదలకు చలికి ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేసి మానవత్వం చాటారని అన్నారు. నగరంలోని పేదలకు అన్నం పెట్టి కడుపు నింపారు. వెంకమ్మ గారి పవిత్ర ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటూ నివాళులర్పించారు. ఈసేవ కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి. పెద్ది శెట్టి శ్రీహరి అన్నాబత్తిన కళ్యాణకృష్ణ. ఇందు హాసిని. శ్రీను .దత్తు. కుర్ర ప్రసాద్ తదితరులు పాల్గొంటున్నారు.

# టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించిన సీనియర్ టిడిపి నాయకులు తిరివీధి



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పామూరు మండలంలో స్వీకరించి నియోజకవర్గంలోని యువతకు ఆదర్శంగా నిలిచిన టిడిపి సీనియర్ నాయకులు తిరివీధి జనార్దన్ రావు.

### తిరివీధి ను అభినందించిన డాక్టర్ ఉగ్ర

పామూరు మండలంలో లక్ష రూపాయలు చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించిన తిరివీధి జనార్దన్ రావును కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జనార్దన్ రావు మాట్లాడుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు సానుభూతిపరులు టిడిపి సభ్యత్వం స్వీకరించాలని తద్వారా కుటుంబాలకు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని ఆయన తెలిపారు.

## మధ్యాహ్న భోజన మేను సుచి శుభ్రతను పరిశీలించిన తహసిల్దార్ పి శ్రీనివాస్ రెడ్డి



వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం అందించే మేను ప్రకారం సరిగా నడుస్తున్నదా లేదా సుచీ శుభ్రతను పరిశీలించి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మండల తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించవలసిన భోజనాన్ని పరిశుభ్రతతో విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం అందిస్తున్న మేను ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన దోమ మండల బిఆర్ఎస్ నాయకులు....



దోమ, మండల రిపోర్టర్ విజయ్ (శుభోదయం న్యూస్): హైదరాబాద్ నగరంలోనీ తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుని మర్యాద పూర్వకంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సమక్షంలో దోమ మండల బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ ను కలిశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మల్లేశం, పీఏసీస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,యూత్ అధ్యక్షులు మచ్చేందర్ రెడ్డి,శశిధర్ రెడ్డి మల్లేపల్లి నర్సింలు,పాల్గొన్నారు..

## వేమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



ప్రకాశం జిల్లా బ్యూరో – చంద్ర (శుభోదయం న్యూస్): నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ నరవాడ వెంగమాంబ అమ్మవారి మాల ధారణ స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేసి, వెంగమాంబ అమ్మవారి జ్ఞాపికను అందజేసిన వరికుంటపాడు మండల తెలుగుదేశం నాయకులు గొడుగులూరి మాలకొండ రాయుడు, మాజీ మండల తెలుగు యువత ప్రచార కార్యదర్శి మార్నేని రామకృష్ణ, టిడిపి యువ నాయకులు నాగేళ్ల నవీన్ చౌదరి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం లోని ప్రతి పంచాయతీకి నిధులు కేటాయించి ప్రతి పంచాయతీ ని అభివృద్ధి పదంలో నడపాలని కోరినట్లు తెలిపారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో పోలీసులు ఆంక్షలు

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్



వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలి,వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు.జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,రాజేష్ చంద్ర డీసీపీ ఐపీఎస్ యాదాద్రి భువనగిరి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలి, పోలీసు వారి సూచనలు పాటించాలని జిల్లా డీసీపీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రజలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినది అని తెలిపారు.డిసెంబర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్ఠమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది.పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.పోలీసుల సూచనలు నిబంధనలు,నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలి.తర్వాత కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం,పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి,మైనర్స్ కు వాహనాలు ఇవ్వవద్దు,టపాసులు, డీజే లు నిషేధం మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు,రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు,మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవద్దు,ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు,ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు.బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం.మైనర్లు కు వాహనాలు ఇవ్వవద్దు.ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలి.న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నెంబర్స్ ఇవ్వవద్దు.అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు అని డీసీపీ హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలిఅని యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర కోరారు.


## మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ విద్యార్థినిలకు ఆరోగ్య పరీక్షలు చేయించిన తాహసిల్దార్




వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు స్థానిక తహసిల్దార్ పి శ్రీనివాస్ రెడ్డి సోమవారం మండల పరిధిలోని లోతుకుంట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ విద్యార్థినిలకు వేములకొండ ఆరోగ్య కేంద్రం వైద్యులచే వైద్య పరీక్షలునిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల వారి యొక్క ఆరోగ్య పరిస్థితులని తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేత

### అందజేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులుజోగు అంజయ్య



వలిగొండ, మండల రిపోర్టర్ వెంకట్ రెడ్డి (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సోమవారం రోజు జిల్లాలోనీ ఉద్యమకారులకు ప్రశంస పత్రాలు అందజేయాలనే నిర్ణయం ప్రకారం గంధమల్ల బాలయ్య అధ్యక్షతన, జోగు అంజన్నరాష్ట్ర ఉపాధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి, గంధ మల్ల మల్లమ్మ ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఇరువురి చేతుల మీదుగా ఉద్యమకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం స్వామి రాష్ట్ర కో కన్వీనర్, బత్తిని రవీందర్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి, కదిరేణి స్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు, మల్లం వెంకటేశం జిల్లా సాంస్కృతిక కార్యదర్శుల సమక్షంలో వరుసగా అంద చేయడం జరిగింది.ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యమ కళాకారులు, ఉద్యమ కారిణులు, ఎదురు గట్ల పెద్ద యాదగిరి, చిన్న యాదగిరి, లక్ష్మయ్య, సందయ్య, భాస్కర్ మరియు సామల యాదమ్మ, శీలం ఇందిర, గొల్లపెల్లి అంజమ్మ, బత్తుల మంగమ్మ, ఎం డి అబ్బాస్ బి లు తదితరులు అందుకున్నారు.

## చలో కరీంనగర్ గోడ ప్రతి ఆవిష్కరణ

### జనవరి 10 న జరిగే డీజేఎఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి : డీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు కల్లెపెల్లి కుమార్




ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో – శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) డిసెంబర్-30: జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి. రాష్ట్ర అధ్యక్షులు మోటపలుకుల వెంకట్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కోల శ్రీనివాస్ పిలుపుమేరకు డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం పెద్దపెల్లి జిల్లా డిజేఫ్ ప్రెస్ క్లబ్ లో చలో కరీంనగర్ గోడ ప్రతిని ఆవిష్కరించడం జరిగిందని కల్లేపల్లి కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా డిజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి కుమార్ మాట్లాడుతూ. డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ విలేకరుల హక్కుల కోసం. విలేకరులకు ప్రభుత్వం నుండి రావలసిన ఉచిత విద్య. వైద్యం.అక్రిడేషన్ తో సంబంధం లేకుండా అందించాలి అనే నినాదంతో జనవరి 10వ తేదీ నాడు ఉద్యమాల పోరుగడ్డ మన కరీంనగర్ జిల్లాలో. ఏర్పాటు చేస్తున్న డిజెఎఫ్ జర్నలిస్టుల రాష్ట్ర మహాసభ సమావేశానికి జాతీయ. రాష్ట్ర. వివిధ జిల్లాల విలేకరులు ఈ సమావేశంనకు హాజరు అయ్యి.విలేకరుల హక్కుల కోసమే ప్రతి నిమిషం పోరాటం చేస్తున్న డిజెఎఫ్ నిర్వహించే సమావేశంను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్. సమన్వయ కమిటీ చైర్మన్ తాండ్ర శ్రీనివాస్. ప్రచార కార్యదర్శి కన్నం అవినాష్. జయ కుమార్. శ్రీనివాస్. రాజేశం. శ్యామ్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

### యన్ ఆర్ టీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన




చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు(శుభోదయం న్యూస్) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సిపిఎం జిల్లా నాయకులు వై రాధాకృష్ణ డిమాండ్ చేశారు.సోమవారం యన్ ఆర్ టి సెంటర్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట సిపిఐ,సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అధికార దాహంతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ మతాల మధ్య కులాల మధ్య చిచ్చులు పెడుతూ దేవుడి పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారని మండిపడ్డారు.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి వాళ్ళ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి భారత రాజ్యాంగ సృష్టికర్త అంబేద్కర్ను అవమానకరంగా మాట్లాడుతూ కోట్లాదిమంది ప్రజల మనోభావాలను కించపరుస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే అమిత్ షా రాజీనామా చేసి అంబేద్కర్ విగ్రహం వద్ద జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు యం రాధాకృష్ణ,సీపీఐ నాయకులు దాసరి వరహాలు,చెరుకుపల్లి నిర్మల,షేక్ సుభాని,కండిమల్ల వెంకటేశ్వర్లు,సిపిఎం నాయకులు పేరు బోయిన వెంకటేశ్వర్లు,ప్రతాప్ రెడ్డి, లూథర్, గిరిజన సమాఖ్య నాయకులు బి.శ్రీను నాయక్, విసీకే పార్టీ నాయకులు వంజా ముత్తయ్య,సీమాంధ్ర శ్రేయస్సు నాయకులు అల్లాభక్షు ఎ ఐ వై యాఫ్ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్థిక దుస్థితిని చక్కదిద్దుతూనే, సంపద సృష్టి దిశగా అడుగులు



**200 రోజుల్లోనే ప్రజల ఆశలు, ఆకాంక్షలు నిజం చేసిన చంద్రబాబుతో రూ,.1000 పింఛన్ ను ఐదేళ్ల పాటు పెంచిన జగన్ రెడ్డికి పోలికా అంటున్న రాష్ట్ర ప్రజలు – ప్రత్తిపాటి పుల్లారావు**

చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : రాష్ట్రంలో ఈ ఏడాది మే లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయ దుంధుభి మోగించింది. ప్రజల ఆశలు,ఆకాంక్షలు, ఆశయాల ప్రతిరూపంగా కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. కొత్త ప్రభుత్వం సరికొత్త ఒరవడితో పాలన సాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే గాక, వారి ఆశల్ని నూటికినూరు శాతం నెరవేర్చింది.హంగు, ఆర్భాటాలకు దూరంగా రెడ్ కార్పెట్ స్వాగతాలకు, అంచెలంచెల భద్రతా వలయాలకు స్వస్తి చెబుతూ, చంద్రబాబుతో సహా మొత్తం కేబినెట్ ప్రజల కోసం, ప్రజల్లో ఒకటిగా కలిసిపోయింది.

### ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు...

అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న గొప్ప నిర్ణయం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు. ప్రజల.. ప్రభుత్వ భూములు తమ సొంత భూములన్నట్టు భావించి వాటిని కాజేయడానికి జగన్ అండ్ కో తీసుకొచ్చిన భూస్వాహా చట్టాన్ని ఒక్కకలం పోటుతో రద్దుచేయడం ద్వారా చంద్రబాబు ప్రజల మనసులు గెలిచారు.

### సామాజిక పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంపు...

అదే ఊపులో ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్లను రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. ఎన్నికల కారణాలతో నిలిచిపోయిన 3 నెలల పింఛన్ ను జూలైలో ఒకేసారి అందించి పింఛన్ దారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించారు.

### అన్నాక్యాంటీన్ల పునరుద్ధరణ...

పేదల కడుపు కొట్టిన జగన్ రెడ్డికి భిన్నంగా, కేవలం రూ.5 తో మూడుపూటలా వారి కడుపునింపే అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం మరో మంచి కార్యమనే చెప్పాలి. 2014-19లోనే చంద్రబాబు అన్నాక్యాంటీన్ల ద్వారా లక్షలాది పేదల ఆకలి బాధలు తీర్చారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చేశాక వాటిని మూసేసి, వారి ఉసురు పోసుకున్నాడు.

### నిర్మాణ రంగం పుంజుకునేలా నూతన ఇసుకపాలసీ...

గత ప్రభుత్వం దోపిడీ వనరుగా మార్చుకున్న ఇసుకను ఇదివరకటి మాదిరే ప్రజలకు ఉచితంగా అందిస్తూ, చంద్రబాబు సర్కార్ తీసుకున్నయా నిర్ణయం నిర్మాణ రంగంతో పాటు, అనుబంధ రంగాలకు కొత్త ఊపిరిపోసిందనే చెప్పాలి. జగన్ హయాంలో పస్తులున్న లక్షలాది కార్మికులకు చేతినిండా పని దొరకడమే కాక, రాష్ట్ర ఆదాయం పెంపుదలకు నూతన ఇసుక పాలసీ దోహదం చేసిందనడం అతిశయోక్తి కాదు. కొత్త ఇసుక పాలసీకి సంబంధించి రవాణా ఛార్జీల విషయంలో కొన్నిచోట్ల వచ్చిన విమర్శలపై వెంటనే దిద్దుబాటు చర్యలను కూడా కూటమి ప్రభుత్వం చేపట్టింది.

### మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు...

పెరిగిన గ్యాస్ ధరలతో మహిళలు పడుతున్న కష్టాలకు పరిష్కారంగా ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్న హామీని గత దీపావళి నుంచే చంద్రబాబు అమల్లో పెట్టి మహిళల మన్ననలు పొందారు.

### కాటేసిన కల్తీ మద్యానికి స్వస్తి.... గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్.

అన్నింటికంటే ప్రధానంగా కల్తీ మద్యంతో మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడి, మహిళల పుస్తెలు తెంపిమరీ తన వ్యక్తిగత ఖజానా నింపుకున్న జగన్ రెడ్డి దుష్ట ఆలోచనకు భిన్నంగా నూతన మద్యం పాలసీని కూటమి సర్కార్ తీసుకొచ్చింది. కల్తీ మద్యం స్థానంలో నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో ఎక్కడా కల్తీమద్యానికి, బెల్టు షాపులకు తావులేకుండా చేసింది. అదే క్రమంలో నేరాలకు మూలమైన గంజాయి కట్టడికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసింది. తొలుత జూన్ లో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం, ఇటీవలే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఏ.ఎన్.టీ.ఎఫ్) ఏర్పాటుకు ఆమోదం తెలపడం ద్వారా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, నాటుసారా, ఇతర మత్తు పదార్థాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టింది.

### సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

జగన్ సర్కార్ పూర్తిగా విస్మరించిన రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు స్వయంగా పరవాడ మండలంలో రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమానికిశ్రీకారం చుట్టారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరూ విధిగా కొత్త రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని, సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతలు ఉండకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 70 శాతం వరకు రోడ్ల నిర్మాణం, మరమ్మతుల పనులు పూర్తయ్యాయి.

### గత పాలకుల దోపిడీకి బలైన వ్యవస్థలకు పునరుత్తేజం...

హామీల అమలుతో పాటు గత ప్రభుత్వవిధానాలు, పాలకుల దోపిడీకి బలైన ప్రజలు, సంస్థలు, వ్యవస్థలను గాడిలో పెట్టే చర్యలను చంద్రబాబు ఆయన బృందం వేగవంతం చేసింది. వివిధ శాఖల్లోని పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడంతో పాటు, పోలీస్, ఆర్టీసీ, తదితర విభాగాలకు జగన్ సర్కార్ ఏళ్ల నుంచి బకాయి పెట్టిన నిధుల్ని ప్రభుత్వం విడుదలచేసింది. నిధుల లేమితో జగన్ హయాంలో నీరుగారిపోయిన పంచాయతీలకు రూ.16,739 కోట్ల నిధులు మంజూరుచేసింది. జగన్ సర్కార్ లో ముంబై నటి ఎదుర్కొన్న వేధింపులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, టీడీపీ..జనసేన.. బీజేపీ శ్రేణులు ఎదుర్కొన్న తప్పుడు కేసులను క్రమపద్ధతిలో, కూటమి ప్రభుత్వం సమీక్షిస్తోంది. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో పాటు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు సర్వం సిద్ధమైంది. 60 సంవత్సరాలు దాటిన వారికి ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ ఛార్జీలపై 25 శాతం రాయితీ కల్పించింది. యువతకు 25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ అమలు దిశగా అడుగులు వేస్తోంది. ఆ క్రమంలో భాగంగా ఇప్పటికే ప్రఖ్యాత ఉక్కుసంస్థలైన ఆర్సెల్లార్ మిట్టల్, నిస్సాన్ స్టీల్స్ సంస్థలతో చర్చలు జరిపి, పరిశ్రమల ఏర్పాటుకోసం 2,200ఎకరాల భూకేటాయింపులు చేసింది. ఈ సంస్థల ఏర్పాటుతో రాష్ట్రానికి 1.47లక్షలకోట్ల పెట్టుబడులతో పాటు, 55వేల మందికి ఉపాధి లభించనుంది. 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఉన్న అడ్డంకులను తొలగించింది. సూపర్ సిక్స్ పథకాలతో పాటు, ప్రజలకు ఇచ్చిన సంపద పెంపు హామీ సహా, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వాన్ని తన అనుభవం, ముందుచూపు, మేధస్సుతో చంద్రబాబు ముందుకు తీసుకెళుతున్నారు.

### రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం పనుల్లో పురోగతి.

జగన్ దుర్బుద్ధితో నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై చంద్రబాబు సమీక్ష చేశారు. ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. పోలవరంతో పాటు, వివిధ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించే వివిధ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల నిర్మాణం కూడా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిఎకరాకు నీళ్లు ఇవ్వాలనే సత్సంకల్పంలో భాగంగా, ఏపీని 100శాతం కరువురహిత రాష్ట్రంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది.

### అమరావతి నిర్మాణ దిశగా అడుగులు...

ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచబ్యాంక్, ఏడీబీ రుణాలు మంజూరు అయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాజధానిలో భూమిలేని కూలీలకు ఇచ్చే పెన్షన్ ను మరో ఐదేళ్లకు పొడిగించింది. కౌలు రైతులకు కోపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంది.ఇవన్నీ ఒకెత్తు అయితే బుడమేరు వరద ధాటికి కకావికలమైన విజయవాడ నగరాన్ని పునర్నిర్మించడం చంద్రబాబు పనితీరుకు మెచ్చుతునక. జేసీబీలు, బోట్లపై ప్రయాణించీ మరీ ప్రజల కష్టసుఖాల్లో చేదోడుగా నిలిచి, సర్వం కోల్పోయిన వరద బాధితులకు అండగా తానున్నానని ముఖ్యమంత్రి ధైర్యం చెప్పిన తీరు, నభూతో.. అన్నట్టు నిలిచింది. ఇలా వందరోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో మెజారిటీ భాగం అమలుచేసి వారి సంతోషం, సంతృప్తిని నూటికి వెయ్యి శాతం పొందడమే గాక, సంపద సృష్టి దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది అనేది రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ అంగీకరించాల్సిన వాస్తవం. వాస్తవాలను అంగీకరించే నైజం, విశాల దృక్పథం జగన్ రెడ్డికి, ఆయనపార్టీ శ్రేణులకు లేదు కాబట్టి, తమ రాజకీయ ఉనికికోసం, ప్రజలు తమను మరిచిపోకూడదన్న దూరాలోచనతో పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. జగన్ రెడ్డి.. వైసీపీ నాయకులు ఎంత గొంతుచించుకున్నా, ఉన్నవి లేనివి పనిగట్టుకొని ప్రచారం చేసినా, ఉనికి కోసం ఎంతగా వెంపర్లాడినా ప్రజలు ఎప్పటికీ వారిని విశ్వసించరనేది కాదనలేని సత్యం. కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్ర మరియు నియోజకవర్గ ప్రజలు.. కూటమి పాలకుల నిర్ణయాలు, జనరంజక పాలనను కొత్త ఆలోచనలు, సరికొత్త ధోరణితో స్వాగతించాలని, సదా మా..మీ.. మనందరి ప్రభుత్వాన్ని ఆదరించి, అభిమానించాలని పత్తిపాటి కోరారు.

## ఘనంగా జరిగిన సీతనగరం మండల మహాసభలు...



పార్వతీపురం మన్యం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్,(శుభోదయం న్యూస్):జనవరి 4,5 - 2025 న పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి, బాల బాలికలకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలి,సీతానగరం మండలం లో సోమవారం ఎస్,ఎఫ్,ఐ ఆధ్వర్యంలో ఈ రోజు మండల మహా సభలు నిర్వహించడం జరిగింది, వేదికగా 22 మందితో మండల కమిటీ వేసి మండల కమిటీ తోనే అధ్యక్ష కార్యదర్శిలుగా ఎన్నుకోబడి బబ్బులు అధ్యక్షులు దిలీప్ కార్యదర్శిలుగా ఎన్నికయ్యారు, ముందుగా ఈ మహా సభలను ప్రారంభ సూచిగగా మాట్లాడి ఎస్,ఎఫ్,ఐ జిల్లా కమిటీ సభ్యులు, కె. డేవిడ్ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం జెండాను ఆవిష్కరించి ప్రారంభిచారు. ఈ మహాసభలకు ఉద్దేశిస్తూ జిల్లా ఉపాధ్యక్షులు టి. అఖిల్ మాట్లాడుతూ......విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా హనర్స్ డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, అదేవిధంగా సీతానగరం మండలం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నపటికి హాస్టల్ సదుపాయం లేదని, ఈ సందర్భంగా విమర్శించారు. సొంతభవనం ఏర్పాటు చేయాలని, ఉన్నత అధికారులు స్కూల్ కాలేజీలను పరిశీలించాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆదోళన చేస్తామన్నారు. అలాగే ఈ మహాసభలు భవిష్యత్తు కర్తవ్యాలు వేదికగా ఉపయోగించుకోవాలి. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని, అదేవిధంగా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారు. దానివల్లన విద్యార్థులు కుటుంబాలకు దూరం అవుతున్నారని, దొంగతనాలకు అలవాటు పడి హత్యాచారాలు చేయడానికి కూడా వెనకాడడం లేదని, దీనివలన వాళ్ల జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు హెచ్. సింహాచలం పట్టణ కమిటీ సభ్యులు సాయి కుమార్ అదేవిధంగా సీతానగరం మండల కమిటీ సభ్యులు దీపిక, కిషోర్, మణి కార్తీక్, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై హెూం మినిస్టర్ అమిత్ షా అవమానకర వ్యాఖ్యలును నిరసిస్తూ

### అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్.!!




బొబ్బిలి, (శుభోదయం న్యూస్): ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మానవహారం, నిరసన దీక్ష బొబ్బిలి ఎన్టీఆర్ బొమ్మ సెంటర్లో చేయడం జరిగింది. ఈ




కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, పట్టణ కళాసి సంఘం, సిపిఐ ఎం. ఎల్. న్యూడెమోక్రసీ, రైతు కూలీ సంఘం, ఎమ్మార్పీఎస్, ఐద్వా, నాయకులు పి. శంకర్రావు, ఎం. శ్రీనివాసరావు, కె. అప్పన్న, భోగాది అప్పలస్వామి, వై అప్పారావు, పిల్ల లక్ష్మణరావు, జి. రమేష్, ఎస్. గోపాల్ కె. పుణ్యవతి బలస శ్రీను కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒంటి గంట తరువాత ఎవ్వరూ రోడ్లపై రాకూడదు....



విజయనగర, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్,(శుభోదయం న్యూస్): నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి.... విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ విజయనగరం:నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో ప్రశాంతయుతంగా నిర్వహించుకోవాలని, వేడుకల పేరుతో ఎవరైనానిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతయుతంగా నిర్వహించుకొనేందుకు ప్రజలకు జిల్లా ఎస్పీ కొన్ని సూచనలు చేసారు. 31 రాత్రి బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు.మద్యం సేవించి వాహనాలు నడవరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలను అతివేగంగా నడిపినా, బైక్ రేసులు నిర్వహించినా, ట్రిపుల్ రైడింగు చేసినా వారిపై కేసులు నమోదుచేస్తామన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. డిసెంబరు 31న నూతన సంవత్సర వేడుకల పేరుతో అర్ధ రాత్రి ఒంటి గంట తరువాత ప్రజలెవ్వరూ రహదారుల పై తిరగరాదన్నారు. మైనర్లుకు వారి తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రైవ్ చేపడతామని,ఎవరైనా మైనరు డ్రైవింగు చేసి పట్టుబడితే, వారిపైనా, వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రులు లేదా ఆయావాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్ళలో పోలీసుబందోబస్తు, పికెట్లును ఏర్పాటు చేసామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, నృత్యాలు చేయడం, బహిరంగ పార్టీలు నిర్వహించడం, డిజే/లౌడుస్పీకర్లుతో పెద్ద శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వేడుకలో పేరుతో మందుగుండు సామగ్రిని కాల్చడం, ప్రదర్శించడం లేదా ఉపయోగించినా చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో గుమిగూడడం, వేడుకలు నిర్వహించడం, ప్రజాశాంతికి భంగం కలిగించినాచర్యలు తప్పవన్నారు. మహిళలు, యువతులను వేధించడం, ఈవ్ టీజింగుకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తేఆయా మద్యం షాపులు, బార్లపైన కూడా చర్యలు తప్పవన్నారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డిసెంబరు 31న రాత్రి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రి పెట్రోలింగు, గస్తీని ముమ్మరం చేసామన్నారు. అంతేకాకుండా, అల్లర్లు జరగకుండా ముఖ్య కూడళ్ళలో పోలీసు పికెట్లును ఏర్పాటు చేసామన్నారు.ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతోఇంటి వద్దనే జరుపుకోవాలని, పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు.

## దామచర్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మరి టైం బోర్డు మొదటి సమావేశం!



టంగుటూరు మండల రిపోర్టర్:- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- మారి టైం బోర్డ్ మొదటి సమావేశం రాష్ట్ర మారీ టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) అధ్యక్షతన మంగళగిరి ఐ హెచ్ సి భవన సముదాయంలో సోమవారం జరిగిందని పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పలు అంశాల గురించి చర్చించడం జరిగింది. ప్రధానంగా 2024 - 25 సంవత్సరానికి సంబంధించి ఏపీ మారిటైమ్ బోర్డ్ బడ్జెట్ అంచనాలపై చర్చ, వాటర్ ఫ్రంట్ రాయితీ, మోటుపల్లి సహజ నౌకాశ్రయ నిర్మాణ ఏర్పాట్లు, పెద్దగంజాంలో నౌక నిర్మాణ కేంద్ర అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో దామచర్ల సత్యనారాయణ చర్చించడం జరిగింది. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ కు అనుగుణంగా పోర్టుల అభివృద్ధి, పెట్టుబడులు, కొత్త ప్రాంతాల అన్వేషణ తదితర అంశాలపై చర్చ కొనసాగిందని పేర్కొనడం జరిగింది.

## ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన డాక్టర్ ఉగ్ర, యారవ, తిరివీధి



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): ప్రజాశక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను కనిగిరి పట్టణంలోని టిడిపి కార్యాలయం నందు (అమరావతి) ఆవిష్కరించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు తిరివీధి జనార్దన్ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి ముందుకు సాగుతున్న ప్రజాశక్తి దినపత్రిక యాజమాన్యానికి, పాఠకులకు అభినందనలు తెలుపుతున్నట్లు వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పామూరు మండల విలేఖరి భత్తుల నాగేశ్వరరావు, పామూరు సాగునీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, పామూరు మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, టిడిపి నాయకులు చిన్న హజరత్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో తీరని తాగునీటి కష్టాలు

## మూడు నెలలుగా నీటిని ట్యాంకర్లతో తెప్పించుకుంటున్న వైనం

### అదును చూసి టాంకర్ల రేట్లు పెంచేస్తున్న ట్యాంకర్ యజమానులు



తనకల్లు, మండల రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): తనకల్లు మండలంలోని పాతూరు గుట్ట కింద బత్తిని వారి పల్లె రహదారి యందు దాదాపు మూడు నెలలుగా తాగునీటి బోరు మరమ్మతుకు గురైంది. బోరు మోటర్ రిపేర్ చేయించి తాగునీరు వదలాల్సిందిగా సచివాలయ అధికారులను సర్పంచ్ ను మూడు నెలలుగా కోరుతున్నా కూడా వారు ఏమాత్రం స్పందించకుండా బోరు మోటర్ రిపేరు చేయకుండా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మూడు నెలల నుండి కిరాయి ట్యాంకర్లతో నీరు తెప్పించుకుంటున్నామని, నీటి ట్యాంకర్ల యజమానులు కూడా ఇదే అదునుగా భావించి ట్యాంకర్ల రేట్లు పెంచేశారని, ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలన్నీ ప్రతిరోజూ కూలి చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి ఉన్నందున మేమంతా నీరు కూడా డబ్బు పెట్టి కొనాల్సి వస్తే మేము ఎలా బతకాలి సారు.. అంటూ ఆ కుటుంబాల ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇదే కాకుండా ఈ నీటి సమస్య ఇక్కడ మాత్రమే కాకుండా బూడిది గడ్డ వీధిలో ఉన్న హరిజనవాడ కాలనీకి, చర్చి వద్ద నివసిస్తున్న కుటుంబాలకు కూడా వారం, పది రోజులుగా మంచినీరు రానందున నీటి కొరకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మా ప్రాంతంలో " నీటి కష్టాలు తీర్చే నాధుడే లేరా " అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా ఏరియాలో నీటి కష్టాలు తీర్చాలని ప్రాధేయపడుతున్నామని ప్రజలు తెలిపారు.

## కందికుంట సమక్షంలో వైసీపీ వీడి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్



తనకల్లు, మండల రిపోర్టర్. రవీంద్ర (శుభోదయం న్యూస్): కదిరి ఎమ్మెల్యే కార్యాలయంలో తనకళ్ళు మండలం బొంతల పల్లి గ్రామానికి చేందిన వైఎస్ఆర్సిపి పార్టీ మాజీ సర్పంచ్ కే శారదమ్మ వారి కుమారులు కే మనోజ్ కుమార్., కే గిరీష్ కుమార్.,వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది పార్టీలో చేరిన వారిని తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కందికుంట వెంకటప్రసాద్ గారు సాధారంగా వారిని పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది అనంతరం వారు పార్టీ సభ్యత్వం కూడా తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోపూరి శెట్టి.చంద్రశేఖర్, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, శంకర్ నాయుడు, రాజారెడ్డి, చంద్రారెడ్డి, పాళ్యం.చంద్రశేఖర్,ఆర్.నరసింహ, పి.శంకర్ రెడ్డి, మల్లెపూల రవి, పీ.జీ రవి, వేణు గోపాల్,నారప్పరెడ్డి,మౌల, తదితరులు పాల్గొన్నారు.

## సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించడం




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):ప్రభుత్వం వారి ఉత్తర్వుల మేరకు 30 డిసెంబర్ 2024 సోమవారం నాడు సింగరాయకొండ మండలం బాలికల ఉన్నత పాఠశాల, సింగరాయకొండ నందు ఇంచార్జి ప్రధానోపాధ్యాయనీ జే. మాధవి ఆధ్వర్యంలోసైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవంలో పాఠశాల విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీవ శాస్త్ర, భౌతిక శాస్త్ర మరియు గణిత శాస్త్ర ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.అలాగే పాఠశాల నుండి మండల స్థాయికి వెళ్ళవలసిన ప్రదర్శనలను కూడా ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయిని జే. మాధవి ఇతర ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు!



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) :- న్యూ ఇయర్ పేరుతో నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు సోమవారం పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, ఇద్దరు అంతకంటే ఎక్కువమందితో ద్విచక్ర వాహనాలు నడిపిన, అతివేగాన్ని ప్రదర్శించిన, అర్ధరాత్రి న్యూ ఇయర్ వేడుకల పేరుతో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి డీజేలు మ్రోగించిన, ప్రజాజీవనానికి ఇబ్బంది కలుగజేసిన అటువంటి వారిపై తప్పక క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలియజేయడం జరిగింది.

## గంధ మహెూత్సవ వేడుకలో పాల్గొన్న ఆకుపాటి, ఉప్పలపాటి, డివి



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్):కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని దర్వాజా గల్లీ దర్గా నందు జరిగిన గంధ మహోత్సవ వేడుకలో పాల్గొన్న ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్, పట్టణ టిడిపి ఫోర్ మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, మాజీ



సర్పంచ్ డివి మనోహర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంధ మహోత్సవ వేడుకలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మన్నం రమణయ్య, సోమిశెట్టి వేణుగోపాలరావు, బండ్ల నారాయణ, గద్దె శేషు, గోళ్ళ వెంకటేశ్వర్లు, గద్దె సుధాకర్, టీ షాపు మాలి, పుప్పాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ క్రీడాకారుడికి కాంపౌండ్ బో అందజేసిన జిల్లా కలెక్టర్



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) : జిల్లాలో క్రీడలకు సంబంధించి ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో. తన చాంబర్ లో ప్రతిభా వంతుడైన ఆర్చరీ క్రీడాకారుడు. ధీరజ్ రావు కు కాంపౌండ్ బో పంపిణీ చేశారు. రామగుండం నగరానికి చెందిన ధీరజ్ రావు జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ఆర్చరీ తనకు కాంపౌండ్ బో కావాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. విద్యార్థి దరఖాస్తు పరిశీలించిన జిల్లా కలెక్టర్ 4 లక్షల 43 వేల 300 రూపాయలను మంజూరు చేస్తూ విద్యార్థినికి అవసరమైన కాంపౌండ్ బో కొనుగోలు చేసి నేడు పంపిణీ చేశారు. విద్యార్థిని భవిష్యత్తులో ఆర్చరీ లో గొప్ప క్రీడాకారిణీగా ఎదగాలని. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు తోడ్పాటు జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్. ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి కొమ్ము రోజు శ్రీనివాస్. పేట సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి సురేందర్. డి రమేష్.ధీరజ్ రావు. తల్లిదండ్రులు తదితరులు పాల్గోన్నారు.

## 1978లో ఇండియాకు జిమ్మీ కార్టర్.. ఓ గ్రామానికి ఆయన పేరు..



కార్టర్‌పురి ఎక్కడుందో తెలుసా? జిమ్మీ కార్టర్ తల్లి ఇండియాలో పీస్ వాలెంటీర్‌గా పనిచేశారు. ఆమె పనిచేసిన గ్రామాన్ని.. అమెరికా అధ్యక్షుడి హెూదాలో జిమ్మీ కార్టర్ విజిట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్తులు తమ ఊరు పేరును కార్టర్‌పురి అని నామకరణం చేసుకున్నారు. 1978లో ఇండియాకు జిమ్మీ కార్టర్.. ఓ గ్రామానికి ఆయన పేరు.. కార్టర్‌పురి ఎక్కడుందో తెలుసా?న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జిమ్మీ కార్టర్(%జీఱఎఎఎ ఋటీవతీ%).. ఇండియాలో పర్యటించారు. హర్యానాలోని గురుగ్రామ్ విలేజ్‌ను ఆయన సతీసమేతంగా 1978లో విజిట్ చేశారు. ఆ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టారు. జిమ్మీ కార్టర్ వచ్చి వెళ్లిన తర్వాత ఆ ఆ ఊరు పేరును మార్చారు. కార్టర్ మరణించినట్లు వార్త తెలియగానే ఆ గ్రామ ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆ ఊరి ప్రజలు ప్రత్యేక నివాళి కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు.భారత్‌ను విజిట్ చేసిన అమెరికా మూడవ అధ్యక్షుడిగా కార్టర్‌కు గుర్తింపు ఉన్నది. ఎమర్జెన్సీ రోజులు ముగిసిన తర్వాత ఆ డెమోక్రటిక్ నేత ఇండియాకు వచ్చారు. హర్యానాలోని దౌల్తాపూర్ నసీరాబాద్ గ్రామాన్ని విజిట్ చేశారు. 1960 దశకంలో జిమ్మీ కార్టర్ తల్లి లిల్లియన్ గోర్డీ కార్టర్ .. దౌల్తాపూర్‌లో పీస్ కార్ప్స్ వాలంటీర్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో జిమ్మీ కార్టర్ తన తల్లి పనిచేసిన ప్రదేశాన్ని విజిట్ చేశారు. అయితే జిమ్మీ కార్టర్ వచ్చి వెళ్లిన తర్వాత ఆ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టారు.మా ఊరి పేరును హర్యానాలోని మరో పేరుతో పోల్చలేమని, మా ఊరి పేరు ప్రత్యేకమైందని ఓ వ్యక్తి తెలిపాడు. జిమ్మీ కార్టర్ తమ ఊరును విజిట్ చేసిన సమయంలో ఆ వ్యక్తి 18 ఏళ్లు ఉన్నాడు. ఆ రోజు జరిగిన సంఘటనలను ఆయన మీడియాకు వివరించాడు. తొలిసారి ఓ విదేశీ వ్యక్తిని అప్పుడు చూసినట్లు చెప్పారు. తలపై దుపట్టా లేకుండా తొలిసారి ఓ తెల్ల అమ్మాయిని చూశామన్నారు. గ్రామం అభివృద్ధి చెందుతుందని భావించి, కార్టర్ పేరును తమ ఊరికి పెట్టినట్లు చెప్పాడు. కార్టర్‌పురి అని పేరు పెట్టినందుకు.. జిమ్మీ కార్టర్ ఆ తర్వాత తమ పంచాయతీకి లేఖ కూడా రాసినట్లు తెలిపాడు.2002లో జిమ్మీ కార్టర్‌కు నోబుల్ శాంతి బహుమతి దక్కింది. ఆ సమయంలో కార్టర్‌పురి సంబరాల్లో తేలినట్లు ఆ వ్యక్తి గుర్తు చేశాడు. జనవరి మూడవ తేదీన కార్టర్ తమ ఊరును విజిట్ చేశారని, దీంతో ఆ రోజును స్థానికంగా సెలువు దినంగా ప్రకటించామన్నారు. కార్టర్ మరణానికి నివాళిగా ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## బీహార్ ప్రభుత్వ తీరును ఎండగట్టిన పలువురు నేతలు



పాట్నా : బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్సి) అభ్యర్థులపై బీహార్ ప్రభుత్వ తీరును సోమవారం పలువురు నేతలు తీవ్రంగా ఎండగట్టారు. నిరంకుశ చర్యలను ఖండిస్తూ విమర్శలు గుప్పించారు. 70వ బిపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆందోళన చేపడుతున్న అభ్యర్థులపై ఆదివారం పోలీసులు విరుచుకుపడిన సంగతి తెలిసిందే. వారిపై లాఠీచార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనాన్‌లను ప్రయోగించారు.ఏతీవ్రమైన చలి పరిస్థితులలో బిపిఎస్సి అభ్యర్థులపై లాఠీచార్జ్‌కి దిగడం, వాటర్ కెనాన్‌లు ప్రయోగించడం అమానుషమని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. బీహార్ ప్రభుత్వం విద్యార్థులను హింసించడం మూడు రోజుల్లో ఇది రెండోసారి. అవినీతిని అరికట్టడం, రిగ్గింగ్, పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టడం ప్రభుత్వం పని అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అవినీతిని అరికట్టడానికి బదులుగా బీహార్ ప్రభుత్వం వారి గొంతుక వినిపించకుండా అణచివేస్తోందని దుయ్యబట్టారు. చలిలో వాటర్ కెనాన్‌లు ప్రయోగించడం అమానుషమని ధ్వజమెత్తారు. బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ యువతపై రెట్టింపు దాడులకు ప్రతీకగా మారిందని అన్నారు. కాగా, అభ్యర్థులపై పోలీసుల చర్య బాధాకరమని బీహార్ మాజీ డిప్యూటీ సిఎం, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ పేర్కొన్నారు. పోలీసుల లాఠీచార్జ్‌లో పలువురు అభ్యర్థులకు తీవ్ర గాయాలయ్యాయని, ఈ చర్యను ఖండిస్తున్నామని అన్నారు. సోషల్ మీడియాలో వైరలవుతున్న దృశ్యాలు బాధ కలిగిస్తున్నాయని, ఒక యువకుడిగా వారి పరిస్థితిని తాను అర్థం చేసుకోగలనని అన్నారు. నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఈ చర్య నిదర్శనమని ఆప్ ఎంపి సంజరు సింగ్ పేర్కొన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నుండి ఈ ప్రవర్తనను ఊహించలేదని అన్నారు. ఈ ఘటనను ఏకలవ్య బటనవేలుతో పోలుస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఏకలవ్యుని బటనవేలుని నరికివేసినట్లు ప్రశ్నా పత్రాలను లీక్ చేయడం ద్వారా యువత భవిష్యత్తును నరికివేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.ఐ

## పురోహితులకు ప్రత్యేక పథకం ప్రకటించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న నేపథ్యంలో మహిళల కోసం 'మహిళా సమ్మాన్ యోజన', వద్ధులకు చికిత్స కోసం 'సంజీవని యోజన' పథకాలను ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దేవాలయాల పూజారులకు 'పూజారి, గ్రంథి సమ్మాన్ యోజన' పథకాన్ని సోమవారం కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ పథకం కింద ప్రభుత్వం పూజారులకు గౌరవ వేతనం కింద రూ.18 వేలు ఇవ్వనుంది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఈరోజు ఒక పథకానికి సంబంధించి ముఖ్యమైన ప్రకటన చేస్తున్నాను. ఈ పథకం పేరు పూజారి, గ్రంథి సమ్మాన్ యోజన. ఈ పథకం కింద ఆలయాల అర్చకులకు, గురుద్వారాలోని 'గ్రంథీ'లకు గౌరవ వేతనంగా రూ.18 వేలు ఇవ్వనున్నాం. పురోహితుల కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టడం దేశంలోనే తొలిసారి. పౌరోహిత్యాన్ని, ఆచార వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లడమే ఈ పథకం ఉద్దేశం. ఇప్పటి వరకూ పురోహితులపై కానీ, వారి కుటుంబాలకు సంబంధించి కానీ ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. వారిని, వారి కుటుంబాలను ఎన్నడూ పట్టించుకోలేదు. వారి పట్ల తగినంత శ్రద్ధ చూపలేదు. అందుకే వారి కోసం, వారి కుటుంబ సభ్యులను దృష్టిపెట్టుకుని మేము ఈ పథకాన్ని ప్రవేశపెట్టనున్నాం. ఇలాంటి పథకం దేశంలోనే తొలిసారి ప్రవేశపెడుతున్నది మా ప్రభుత్వమే. మేము అనేక పనులు చేశాం. అనేక పాఠశాలలను, ఆసుపత్రులను మెరుగుపరిచాం. మహిళలకు ఉచిత బస్సును ప్రకటించాము. మేము ప్రవేశపెట్టిన పథకాలను బిజెపి, కాంగ్రెస్‌లు అనుసరించాయి. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పథకాలను అమలు చేస్తాయని నేను ఆశిస్తున్నా' అని చెప్పారు. కాగా, ఆప్ ప్రకటించిన మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలపై బిజెపి నేతలు మండిపడుతున్నారు. వీటికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఢిల్లీలోని వక్ఫ్‌బోర్డు ఇమామ్‌లు 17 నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు.ఐ

## కేజ్రీవాల్ నివాసం ఎదుట ఢిల్లీ వక్ఫ్‌బోర్డు ఇమామ్‌ల నిరసన



న్యూఢిల్లీ : గడిచిన ఏడాదిన్నరగా ఆప్ ప్రభుత్వం తమకు జీతాలు చెల్లించలేదని.. వెంటనే తమ జీతాల్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఢిల్లీ వక్ఫ్‌బోర్డుకు చెందిన ఇమామ్‌లు ఆప్ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసం ఎదుట నిరసన చేశారు. ఈ నిరసనల్లో పాల్గొన్న ఆల్ ఇండియా ఇమామ్ అసోసియేషన్ ఛైర్మన్ సాజిద్ రషిది మీడియాతో మాట్లాడుతూ.. '17 నెలలు కావస్తున్నా ఆప్ ప్రభుత్వం మాకు జీతాలు చెల్లించలేదు. మా జీతాల చెల్లింపులకు సంబంధించిన విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, లెఫ్టినెంట్ గవర్నర్, సీనియర్- జూనియర్ అధికారులతో చర్చించాము. జీతాల చెల్లింపులపై వారు మాకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అందుకే కేజ్రీవాల్ నివాసం ఎదుట నిరసన చేపట్టాల్సివచ్చింది. మాకు సరైన సమాధానం ఇచ్చేంతవరకు ఆందోళనలు కొనసాగుతాయి. ఇకపై ఆందోళనలను ఉధృతం చేస్తాము' అని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'గడచిన ఆరు నెలలుగా మా సమస్యల పరిష్కరించమని కోరుతున్నాం. సిఎం, అధికారులతో సహా కనీసం 50 దఫాలుగా చర్చించాము. అయినా, మా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 20 రోజుల కిందట సిఎం అతిషిని కలిశాము. నాలుగైదు రోజుల్లో మా సమస్యల్ని పరిష్కరిస్తామని చెప్పారు. కానీ మా సమస్యలను పరిష్కరించలేదు' అని రషిది ప్రభుత్వంపై మండిపడ్డారు. మాకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని అధికారంలో ఉన్న ఆప్ పార్టీని, ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌ని కోరుతున్నాం. ఈ వారంలోనే అరవింద్ కేజ్రీవాల్‌ని మూడుసార్లు కలిసినా ఆయన స్పందించలేదని ఢిల్లీలోని పహర్‌గంజ్‌లో మసీదులోని ఇమామ్ మొహమ్మద్ ఇబ్రహీం మీడియాకు వెల్లడించారు.

## సాయుధ దుండగుల నాలుగు బంకర్లు ధ్వంసం



ఇంఫాల్ : గతవారం తాజా కాల్పుల ఘటనల అనంతరం మణిపూర్‌లో నాలుగు సాయుధ దుండగుల బంకర్‌లను ధ్వంసం చేసినట్లు పోలీసులు సోమవారం ప్రకటించాయి. మరో మూడింటిని ఆక్రమించుకున్నామని తెలిపారు. తమ్నాపోక్పీ, సనాసాబి గ్రామాల సరిహద్దుల్లోని అనేక ప్రాంతాల్లో గత రెండు రోజులుగా భారీ ఆపరేషన్లు నిర్వహించి బంకర్లను ధ్వంసం చేశామని పోలీస్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఇటీవల కాల్పులకు పాల్పడిన దుండగులను కూడా గుర్తించామని అన్నారు. కొండలు, లోయ ప్రాంతాల్లో ఉన్న మరో మూడింటిని భద్రతాదళాలు ఆక్రమించుకున్నాయని చెప్పారు. కాంగ్‌పోక్పీ జిల్లాలోని ఉయోక్ చింగ్‌లోని ఆధిపత్య ప్రాంతాలను సైన్యం, బిఎస్‌ఎఫ్, సిఆర్‌పిఎఫ్ సంయుక్త బృందాలు ఆక్రమించాయి. తమ్నాపోక్పీ, సనాసాబి గ్రామాల్లో తుపాకీ దాడుల్లో పోలీసు సిబ్బంది, ఓ మహిళతో సహా నలుగురు వ్యక్తులు గాయపడిన సంగతి తెలిసిందే.


# ఆత్మావలోకనం



మానవ అస్తిత్వాన్ని గురించిన చర్చ ప్రపంచంలో చిరకాలంగా ఉంది. మానవ దేహం సజీవంగా ఉన్నంత వరకు అందులో చైతన్యం ఉంటుంది. ఆ చైతన్యాన్నే ప్రాణం అంటున్నాం. శరీరాన్ని విడిచి ప్రాణం పోవడమే మరణం. మరణించిన తర్వాత శరీరాన్ని దహనం చేయడమో, పూడ్చిపెట్టడమో చేస్తారు. మరణం తర్వాత ప్రాణం ఏమవుతుందనే దానిపై రకరకాల ఊహలు ఉన్నాయిబీ దీనిపై రకరకాల ఆధ్యాత్మిక సిద్ధాంతాలు ఉన్నాయిబీ రకరకాల మత విశ్వాసాలు ఉన్నాయి. శరీరాన్ని సజీవంగా నిలిపి ఉంచే చైతన్యాన్నే ఆధ్యాత్మికవేత్తలు ఆత్మ అంటారు. 'నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః/ న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః' అని శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో చెప్పాడు. ఆత్మను ఆయుధాలు ఖండించలేవు, అగ్ని దహించలేదు, నీరు తడపలేదు, గాలి ఆరబెట్టలేదు. గీతాసారం ప్రకారం ఆత్మ సమస్త ప్రకృతి శక్తుల ప్రభావానికీ అతీతమైనది. జీర్ణవస్త్రాన్ని విడిచి కొత్త వస్త్రాన్ని తొడుక్కున్నట్లే, జీర్ణశరీరాన్ని విడిచిన ఆత్మ తిరిగి కొత్త శరీరాన్ని వెతుక్కుని వెళుతుందనే నమ్మకం కూడా ఉంది. 'పునరపి జననం పునరపి మరణం/ పునరపి జననీ జఠరే శయనం' అని ఆదిశంకరుడు చెప్పాడు. శరీరం మరణించినా, ఆత్మకు మాత్రం జనన మరణ పరిభ్రమణం తప్పదని ఆయన సారాంశం. ఆత్మకు మరణం లేదనే నమ్మకం ప్రపంచంలోని చాలా మతాల్లో ఉంది. ఆత్మ మరణం లేనిదే కాదు, ఆద్యంత రహితమైనది కూడానని జైనుల సిద్ధాంతం. సమస్త సృష్టిలోని సూక్ష్మాతి సూక్ష్మ క్రిమి కీటకాలు మొదలుకొని మనుషులు సహా భారీ జంతువుల వరకు సమస్త జీవుల్లోనూ ఆత్మ ఉంటుందని జైనుల విశ్వాసం. చైనాకు చెందిన తావో మతమైతే- ప్రతి వ్యక్తిలోనూ 'హున్', 'పో' అనే రెండు రకాల ఆత్మ ఉంటుందని, ఈ రెండు రకాలు 'యాంగ్', 'యిన్' అనే సానుకూల, ప్రతికూల శక్తులతో నిండి ఉంటుందని చెబుతుంది. తావో మతం కూడా పునర్జన్మలను నమ్ముతుంది. ఆధునికుల్లో చాలా మంది మతాలకు అతీతంగా ఆత్మ అస్తిత్వాన్ని తెలుసుకోవడానికి, దానిని నిర్వచించడానికి ప్రయత్నించారు. 'నేను' అనే స్పృహ ఆత్మకు మూలమని, అలాగని ఆత్మ అస్తిత్వాన్ని నిరూపించడం గాని, ఖండించడం గాని సాధ్యం కాదని జర్మన్ తత్త్వవేత్త ఇమ్మాన్యుయేల్ కాంట్ చెప్పాడు. ఆత్మ అస్తిత్వాన్ని గురించి ఎన్నో సిద్ధాంతాలు, కల్పనలు, విశ్వాసాలు ఉన్నాయి. ఆత్మ పదార్థమా, కాదా అనే సంగతి ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. ఒకవేళ పదార్థమే అయితే, అది ఏ స్థితిలో ఉంటుందో కూడా చెప్పలేదు. అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త డంకన్ మెక్‌డూగల్ ఆత్మకు బరువు ఉంటుందని, ఆ బరువు ఇరవై ఒక్క గ్రాములని ఒక ప్రయోగం చేసి మరీ చెప్పాడు. ఆ తర్వాతి కాలంలో రాబర్ట్ ఎల్ పార్క్, బ్రూస్ హుడ్ వంటి శాస్త్రవేత్తలు మెక్‌డూగల్ ప్రయోగంలో శాస్త్రీయత లేదంటూ కొట్టి పారేశారు. మరణానంతరం ఆత్మ ఏమవుతుందనే దానిపై మత సిద్ధాంతాలు ఎలా ఉన్నా, దీనిపై చాలామందికి తీరని సందేహాలు ఉన్నాయి. మరణంతోనే ఒక జీవి చరిత్ర పరిసమాప్తమైపోతుందని, ఆత్మ అనేది ఏదీ ఉండదని హేతువాదులు అంటారు. ఆధ్యాత్మికవేత్తల్లోనే కాదు, సాహితీవేత్తల్లోనూ ఆత్మ అస్తిత్వానికి సంబంధించిన పరిపరి విధాల అభిప్రాయాలు ఉన్నాయి. 'మరుజన్మ ఉన్నదో లేదో/ ఈ మమతలప్పుడేమవుతాయో' అన్నారు ఆత్రేయ. 'చచ్చిపోయి జీవి ఎచ్చట కేగునో/ ఏమి యగునో ఎవరికెరుగ రాదు/ ఎరుకలేని వారలేమేమొ చెప్పగా/ విని తపించువారు వేన వేలు' అన్నారు అబ్బూరి రామకృష్ణారావు. ఆయన తన జీవిత చరమాంకంలో చెప్పిన పద్యమిది. ఆత్మ గురించి, 'ఆత్మజ్ఞానం' గురించి వివిధ మతాల్లో అనేకానేక సిద్ధాంతాలు ఉన్నాయి. ఆత్మ అస్తిత్వంపై అనేక విశ్వాసాలు ఉన్నాయి. ఆత్మ ఉందనేందుకు శాస్త్ర సాంకేతిక నిరూపణలు లేకున్నా, ఆత్మ అనే భావన సహస్రాబ్దాలుగా మానవాళిపై ప్రభావం చూపుతోంది. ఆత్మ భావన ప్రభావం మత సిద్ధాంతాలతో పాటు తత్త్వశాస్త్రంలోను, సాహిత్యంలోను, ఇతర సృజనాత్మక కళలలోను కనిపిస్తుంది. 'ఆత్మ' భావన చాలావరకు ఆస్తికుల ప్రవర్తనను నియంత్రిస్తూ వస్తోంది. కర్మ సిద్ధాంతానికి, పాప పుణ్యాల విచక్షణకు, పాపభీతికి మూలం 'ఆత్మ' భావనే! ఆత్మ అస్తిత్వాన్నే గుర్తించనివారు ప్రపంచ జనాభాలో అతి తక్కువమంది మాత్రమే ఉంటారు. కృత్రిమ మేధ మనుషుల రోజువారీ జీవితాలను ప్రభావితం చేస్తున్న వర్తమాన కాలంలో కూడా ఆత్మ అస్తిత్వాన్ని నమ్మేవాళ్లే ఎక్కువ. ఇప్పటి వరకు ప్రపంచానికి తెలిసి ఆధునిక శాస్త్రవేత్తలెవరూ ఆత్మ అస్తిత్వాన్ని గురించి పెద్దగా పరిశోధనలు సాగించలేదు. అయితే, అమెరికా రక్షణశాఖ ప్రధాన కేంద్రం 'పెంటగాన్' ఈ అంశంపై 1983లోనే పరిశోధన చేసింది. మనిషి మరణించినా ఆత్మ మరణించదంటూ లెఫ్టినెంట్ కల్నల్ వేయన్ మెక్‌డోనల్ తన పరిశోధన పత్రంలో రాశారు. అమెరికా గూఢచర్య సంస్థ 'సీఐఏ' 2003లో బహిర్గతపరచిన రహస్య పత్రాల్లో ఇది కూడా ఉంది. అయితే, ఇటీవలే ఇది వెలుగులోకి రావడంతో పాశ్చాత్య పత్రికలు, ప్రసార సాధనాల్లో పలు వ్యాఖ్యానాలతో కూడిన కథనాలు వెలువడ్డాయి. ధ్యానస్థితిలో సూక్ష్మశరీరయానం అనుభవాల గురించి ఆధ్యాత్మికవేత్తలు, యోగసాధకులు చెబుతుంటారు. దీనినే 'ఔటాఫ్ బాడీ ఎక్స్‌పీరియెన్సెస్' అంటున్నారు. గూఢచర్యంలో ఇలాంటి అనుభవాలను ఉపయోగించుకోవడం ఎలా అనేదానిపైనే మెక్‌డోనల్ పరిశోధన చేశారు. దీనిపై శాస్త్రవేత్తలు ఏమేరకు ఆత్మావలోకనం చేసుకుంటారో చూడాలి.

# మిట్టల్‌పై ఎందుకంత ప్రేమ?




నోటితో నవ్వి నొసటితో వెక్కిరించాడన్న సామెత విశాఖ ఉక్కు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరికి సరిగ్గా నప్పుతుంది. దశాబ్దాల పోరాటాల చరిత్ర కలిగిన వైజాగ్ స్టీల్‌ను ప్రైవేటుపరం చేసేందుకు మోడీ ప్రభుత్వం పన్నిన కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు 1,400 రోజులకుపైబడి ఆందోళనలను హోరెత్తిస్తున్నారు. ఇప్పుడే బుధవారం ఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన చంద్రబాబు, వైజాగ్ స్టీల్‌కు సమీపంలోనే అనకాపల్లి జిల్లాలో నెలకొల్పదలిచిన ఆర్సెల్లార్ మిట్టల్ ప్రైవేటు స్టీల్ సంస్థకు ముడి ఇనుప ఖనిజం కేటాయించాలని విన్నవించారు. ఆ వెంటనే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలుసుకొని విశాఖ స్టీల్‌ను బలోపేతం చేయాలన్నారు. ఈ సంఘటన ప్రధాని వద్ద వైజాగ్ స్టీల్‌ను సిఎం కావాలనే విస్మరించారని అర్థం కావట్లేదా? విశాఖ ఉక్కును సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా అసలు ఇప్పటికి భూమి కూడా కేటాయించని మిట్టల్ సంస్థకు నిరంతరాయంగా ఇనుప ఖనిజం అందుబాటు, ప్లాంట్ ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు కేంద్రం నుంచి కావాలంటున్న రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వానికి మిట్టల్‌పై ఎందుకంత మమకారం? వైజాగ్ స్టీల్‌పై ఎందుకు శీతకన్ను? ప్రైవేటీకరణను నిరసిస్తూ దాదాపు నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు కార్మికుల ఉద్యమం టిడిపి కూటమి సర్కారుకు తెలియనిది కాదు. ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, వైజాగ్ స్టీల్‌ను రక్షిస్తామని ఎన్నికల్లో టిడిపి, మిత్ర పార్టీ జనసేన హామీ ఇవ్వగా, కూటమిలోని బిజెపి నోరు కట్టేసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లుకాగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్రంలోని మోడీ సర్కారు వదిలిపెట్టలేదు సరికదా ఫ్యాక్టరీని దెబ్బతీసేందుకు పలు దుశ్చర్యలకు తెరతీసింది. ఉత్పత్తిని తగ్గించేందుకు ఉద్యోగులను ఇంటికి పంపేందుకు నిరంతరాయంగా కుట్రలు చేస్తూనే ఉంది. పలు విభాగాలను మూసేయడమో, ఖాయిలా పెట్టడమో, ప్రైవేటీకరించడమో చేస్తోంది. మోడీ ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం అనుసరిస్తున్న ఈ కుయుక్తులను కార్మికులు ఎదిరించి పోరాడుతున్నారు. కొన్నింటిని తాత్కాలికంగానైనా అడ్డుకోగలిగారు. సుమారు 26 వేల మంది పని చేస్తుండగా, వేలాది మందికి మూడు నెలల నుంచి వేతనాల్లేవు. వారి జీతభత్యాలనే పెట్టుబడిగా పెట్టి ప్లాంట్‌ను నడిపిస్తున్న దుర్మార్గం ప్రతిష్టాత్మక వైజాగ్ స్టీల్‌లో రాజ్యమేలడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిగ్గుచేటు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడుల వెంపర్లాటలో ఆర్సెల్లార్ మిట్టల్ పాట పాడుతోంది. ఇండిస్టియల్ డెవలప్‌మెంట్ బోర్డు, కేబినెట్ సమావేశాల్లో మిట్టల్‌కు అధిక ప్రాధాన్యమిస్తోంది. భూముల బదలాయింపు, జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ రాయితీ, ఫీజుల మినహాయింపు, పెట్టుబడిసాయం, మంచినీరు, రోడ్లు, రైల్వే లైన్ల కల్పనకు సిద్ధమైంది. మరో వైపు ఆంధ్రుల హక్కు అయిన ప్రభుత్వరంగంలోని వైజాగ్ స్టీల్‌కు మాత్రం ఎలాంటి పన్నులు, విద్యుత్ రాయితీలు ఇవ్వట్లేదు. కనీసం మంచినీటి బిల్లుల వాయిదాకు సైతం ఇష్టపడట్లేదు. దీన్నిబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎవరి పక్షమో తెలుస్తుంది. ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన హామీల్లో విశాఖ స్టీల్‌కు ఇనుప గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ.18 వేల కోట్ల ప్యాకేజి ముఖ్యమైనవి. అధికారంలోకి వచ్చి ఆరు మాసాలైనా ఆ హామీల ఊసు లేదు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరిన టిడిపి, కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ను దెబ్బతీస్తున్నా మౌనం దాల్చడం రాజకీయ అవకాశవాదం అనిపించుకుంటుంది. వైజాగ్ స్టీల్ పరిరక్షణ బాధ్యత టిడిపి-జనసేనలది. కేవలం 243 మంది పని చేసే పొరుగునున్న కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఉక్కు ఫ్యాక్టరీకి మోడీ ప్రభుత్వం రూ.15 వేల కోట్ల ప్యాకేజి ఇచ్చింది. మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ప్రైవేటీకరణ సహా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసే అన్ని చర్యలనూ టిడిపి కూటమి సర్కారు అడ్డుకోవాలి. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడటమంటే ఇదే.

# కఠిన చట్టాలతోనే ప్రజారోగ్య పరిరక్షణ



మనిషికి ఔషధాలు ప్రాణావసరం. తయారీదారులకు ఇవి కామధేనువులు. వైద్యులకు కల్పతరువులు. ప్రజారోగ్య పరిరక్షణలో ఔషధ తయారీ పరిశ్రమలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది కీలకపాత్ర పోషించాలి. ఔషధ నియంత్రణలో ప్రమాణాలన్నింటినీ నిర్దిష్టంగా పాటించాలి. అప్పుడే ప్రజారోగ్యానికి భద్రత. ఈ మూడింటి మధ్య అనుసంధానంలో ఎక్కడ లింకు తెగినా, అంతరాయాలేర్పడినా, వారు కట్టుదాటినా అది ప్రజారోగ్య వ్యవస్థనే కుప్పకూలుస్తుంది. అలాంటి పరిస్థితులిప్పుడు ఫార్మా రంగ ప్రమాదకర పోకడల వల్ల ఏర్పడుతోంది. ఇండియా, ఖతార్, యూకేలకు చెందిన నూతన అధ్యయన బృందం ప్రచురించిన ఒక నివేదికలోని అంశాలు భారత్ ఫార్మా రంగంలోని ప్రమాదకర పోకడలను తేటతెల్లం చేసింది. భారత్‌లో అనుమతులు లేని, నిషేధించిన 'స్థిర మోతాదు మిశ్రమం' (ఫిక్స్ డోస్ కాంబినేషన్'-ఎఫ్‌ఎసీ)తో కూడిన యాంటీబయోటిక్స్ అమ్మకాలు అపరిమితంగా ఉన్నాయని ఆ పరిశోధనా బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఫార్మా ఎస్టీసీ డేటా ప్రకారం 2020లో 60.5 శాతం ఎఫ్‌ఎసీ బయోటిక్స్ (239 ఫార్ములేషన్) అనుమతులు లేనివి. మరో 9.9 శాతం (39 ఫాద్యులేషన్) నిషేధించి నప్పటికీ.. అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. . వీటిలో అతి ప్రమాదకరమైన యాంటీ బయాటిక్స్, వీటిలో అధిక మోతాదులో యాంటీ బ్యాక్టీరియల్ మైక్రో బయోలైన్ నిరోధకాలు ('ఏఎంఆర్) ఉన్నాయి. ఈ ఎఫ్‌ఎసీ అనేది ఒకటికి మించిన స్థిర మోతాదు మిశ్రమం. ఇలాంటి సమ్మిళిత ఔషధాలవల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఈ కారణంగా ఎఫ్‌ఎసీల ఉత్పత్తికి శాస్త్రీయ, నిర్ణీత అనుమతుల ప్రక్రియ సంక్లిష్టం అవుతున్నది. అయితే, మనదేశంలో ఈ పరిశ్రమకు ఈ ఎఫ్‌ఎసీ ఎంతో ఇష్టమైంది. కాసులు కురిపించే కల్పతరువు. ప్రజారోగ్యాన్ని ఆ పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవు. ఔషధాల ఉత్పత్తి ధరల నియంత్రణలో విధానాలు, లోపాలు పరిశ్రమల యాజమాన్యాలకు తెలుసు. మనదేశంలో డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ అనే చట్టం మందుల ధరలను నిర్దేశిస్తుంది. డీపీసీఓ పరిధిలో ఈ 'స్థిర డోస్ కాంబినేషన్' లేదు. ఈ అవకాశాన్ని ఈ రంగం ఉపయోగించుకుంటోంది. తమకు తోచిన కాంబినేషన్లలో ఎఫ్టీసీలను ఉత్పత్తి చేసి మార్కెట్ లోకి జొప్పిస్తోంది. ఎంత ముప్పు ఏర్పడినా విచారణకు ఆస్కారం ఉండదు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 ఉన్నప్పటికీ, మహా అయితే మార్కెట్లో శాంపిల్స్ తీస్తే వాటిని నాణ్యత పరీక్షల కోసం తిరిగి తయారీదారులకే పరీక్ష నిమిత్తం పంపుతారు. ఏతావాతా వారి ఉత్పత్తులకు వాళ్లే తయారీ, పంపిణీ, శాంపిల్స్ తనిఖీ ప్రమాణాలన్నిటికి వారే సర్వాధికారులు. ఈ ఎఫ్‌ఎసీల ఉత్పత్తివల్ల ఆయా పరిశ్రమలకు మరో ప్రయోజనం ఉంది. వాటి ధరలను ఆయా సంస్థలు తమ ఇష్టానుసారం నిర్ణయించుకోవచ్చు. దండుకోవచ్చు. ఇలా రోగులను ఆరోగ్యపరంగానూ, ఆర్థికంగానూ పీల్చిపిప్పి చేస్తున్నారు. దీనిపై 1978లోనే మొదటి ప్రభుత్వ అధ్యయన కమిటీ అధ్యయనం చేసి సమస్య ఉన్నట్లు అంగీకరించింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి డ్రగ్స్ భద్రత, నాణ్యతకు సంబంధించి ఇండియాలో అమ్మకాలపై 1982 వరకూ ఎలాంటి నియంత్రణా లేదు. స్టేట్ డ్రగ్ కంట్రోలర్స్ ఆధీనంలో ఆయా రాష్ట్రాల్లో డ్రగ్స్ తయారీ లైసెన్స్, నాణ్యత ప్రమాణాలు వగైరాలు ఉండేవి. అయితే 1982లో మన పార్లమెంటు చట్టం చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు సంక్రమించాయి. అవి రోగ నివారణలో (థెరపీయూటిక్ వాల్యూ) న్యాయబద్ధంగా లేకుంటే వాటి తయారీని బహిష్కరించాలనేది. అనంతరం 1988లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సవరించింది. నూతన డ్రగ్స్ తయారీలో కావలసిన, ఉండాల్సిన అవసరమైన షరతులు విధించింది. దీని పరిధిలోకి ఎఫ్‌ఎసీలను తెచ్చింది. భద్రతకు సంబంధించిన ఆధారాలు, డ్రగ్స్ లోని మూలకాల పనితీరులాంటి వివరాలను 'డ్రగ్స్ కంట్రోల్ జనరల్ ఆఫ్ 'ఇండియా' (డీజీసీఐ)కి సమర్పించాలి. దీని ప్రకారం స్టేట్ డ్రగ్ కంట్రోలర్స్ కొత్త డ్రగ్స్ తయారీ లైసెన్సు ఇవ్వరాదు. అవి డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా వారి భద్రత, నిర్దేశిత ప్రయోగాల అనంతరం సత్ఫలితాల్ని బట్టి డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా ప్రమాణాల అనుమతి మేరకే ఉత్పత్తి చేయాలి. చట్టం ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ %ా%డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా తయారీ లైసెన్సులివ్వనప్పటికీ, స్టేట్ డ్రగ్స్ కంట్రోలర్స్ లైసెన్సులు ఇవ్వడం ఆశ్చర్యకరం.. వాస్తవానికి ఆయా చట్టాలను, నియమాలను ఉల్లంఘించినప్పుడు. డీసీజీఐ అనుమతి పొందకుండా ఉత్పత్తి చేసిన పరిశ్రమలను సాంకేతికంగా విచారించవచ్చు. ఈ క్రిమినల్ నేరాలన్నింటినీ. విచారించడానికి, తగు రీతిలో శిక్షించడానికి బదులు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది పైపెచ్చు చట్టంలోని సెక్షన్ 26వ సెక్షన్ అడ్డం పెట్టుకుని వీటి తయారీ బహిష్కరణకు అడ్డుతగులుతున్నది. వాస్తవానికి 2020లో 239 ఎఫ్జీసీ ఔషధాలకు అనుమతి లేకుండానే ఉత్పత్తి చేసినట్లు ఈ అధ్యయనం పేర్కొంది. ఈ సమస్య ఆరంభమైన 42 సంవత్సరాల తర్వాత కూడా డ్రగ్ నియంత్రణ చట్టం నిరుపయోగంగా ఉండటం బాధాకరం. ఇప్పటికైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలి, ఆంక్షలు, నిబంధనల బంధనాలు వేయాలి. ప్రజారోగ్యం రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకు తగ్గట్టు చట్టాలను కఠినతరం చేయాలి.

# స్పోర్ట్స్ న్యూస్



## రికార్డు డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించిన ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్

ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సరికొత్త చరిత్ర సృష్టించాడు. జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో డబుల్ సెంచరీ (246) చేసిన షాహిది.. ఆఫ్ఘనిస్తాన్ తరపున టెస్ట్‌ల్లో రెండు డబుల్ సాధించిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. షాహిది 2021లో జింబాబ్వేపై తొలి డబుల్ సెంచరీ (200) చేశాడు. తాజాగా డబుల్‌తో షాహిది మరో రికార్డు కూడా సాధించాడు. ఆఫ్ఘనిస్తాన్ తరపున టెస్ట్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ (246) సాధించిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఇదే మ్యాచ్‌లో మరో ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్ రహ్మత్ షా (234) కూడా డబుల్ సెంచరీ చేశాడు. షాహిది?కి ముందు రహ్మత్ షాదే ఆఫ్ఘనిస్తాన్ తరపున అత్యధిక స్కోర్‌గా ఉండేది. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ తరపున టెస్ట్‌ల్లో మూడు డబుల్ సెంచరీలు మాత్రమే నమోదయ్యాయి. ఈ మూడింటిలో రెండు ఇదే మ్యాచ్‌లో నమోదు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో మరో ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు (అఫ్సన్ జజాయ్) సెంచరీ (113) చేశాడు. రహ్మత్, షాహిది డబుల్.. జజాయ్ సెంచరీ సాధించడంతో ఆఫ్ఘనిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ (699) చేసింది. టెస్ట్‌ల్లో ఆఫ్ఘనిస్తాన్‌కు ఇదే అత్యధిక స్కోర్. ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు ఆఫ్ఘన్ ఆటగాళ్లు మూడంకెల స్కోర్లు సాధించడం కూడా ఇదే మొదటిసారి. 639 పరుగుల వరకు 3 వికెట్లు మాత్రమే కోల్పోయిన ఆఫ్ఘనిస్తాన్.. ఆతర్వాత 60 పరుగుల వ్యవధిలో మిగిలిన ఏడు వికెట్లు కోల్పోయింది. జింబాబ్వే బౌలర్లలో బ్రియాన్ బెన్నెట్ ఐదు వికెట్లు పడగొట్టగా.. సీన్ విలియమ్స్ 2, ముజరబానీ, గ్వాందు, న్యామ్హురి తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు జింబాబ్వే సైతం తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ (586) చేసింది. జింబాబ్వే ఇన్నింగ్స్‌లో సైతం ముగ్గురు మూడంకెల స్కోర్లు సాధించారు. సీన్ విలియమ్స్ (154), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (104), బ్రియాన్ బెన్నెట్ (110 నాటౌట్) సెంచరీలు చేశారు. కెరీర్‌లో తొలి టెస్ట్ ఆడుతున్న బెన్ కర్రన్ (ఇంగ్లండ్ ఆటగాడు సామ్ కర్రన్ అన్న) అర్ధ సెంచరీతో (68) రాణించాడు. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్ స్కోర్‌తో పోలిస్తే ఆఫ్ఘనిస్తాన్ 113 పరుగులు ఎక్కువగా సాధించింది. జింబాబ్వే ఆటగాడు బ్రియాన్ బెన్నెట్ సెంచరీ సహా ఐదు వికెట్లు ప్రదర్శన నమోదు చేయడం మరో విశేషం. 113 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే 5 ఓవర్ల అనంతరం వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసింది. బెన్ కర్రన్ (23), జాయ్‌లార్డ్ గుంబీ (4) క్రీజ్‌లో ఉన్నారు. ఆఫ్ఘనిస్తాన్ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు జింబాబ్వే ఇంకా 81 పరుగులు వెనుకపడి ఉంది. మ్యాచ్ చివరి రోజు రెండో సెషన్ ఆట కొనసాగుతుంది. కాగా, మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ల కోసం ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేలో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లను ఆఫ్ఘనిస్తాన్ కైవసం చేసుకుంది. టీ20 సిరీస్‌ను 2-1 తేడాతో నెగ్గిన ఆఫ్ఘన్లు.. వన్డే సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకున్నారు. ప్రస్తుతం తొలి టెస్ట్ జరుగుతుండగా.. రెండో టెస్ట్ జనవరి 2న ప్రారంభంకానుంది.

## నెమ్మదిగా మొదలుపెట్టి... ధనాధన్ దంచికొట్టి!.. పదకొండేళ్ల తర్వాత

### – డేవిడ్ వార్నర్ –

ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాటర్ డేవిడ్ వార్నర్ ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్ తో బిజీగా ఉన్నాడు. ఈ టీ20 లీగ్‌లో సిడ్నీ థండర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్నర్.. అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. ఎట్టకేలకు అర్ధ శతకం సాధించాడు. దాదాపు పదకొండేళ్ల అనంతరం బీబీఎల్‌లో తొలిసారి యాభై పరుగుల మార్కును అందుకున్నాడు.

**కెప్టెన్‌గా వార్నర్**

అయితే, విధ్వంసకర బ్యాటింగ్‌కు పెట్టింది పేరైన పొట్టి ఫార్మాట్లో సుదీర్ఘ విరామం తర్వాత హాఫ్ సెంచరీ బాదిన వార్నర్ భాయ్.. అందుకోసం ఏకంగా 40 బంతులు తీసుకోవడం గమనార్హం. కాగా డిసెంబరు 15 బీబీఎల్ 2024-25 సీజన్ ఆరంభమైంది. ఈ క్రమంల డిసెంబరు 17న వార్నర్ కెప్టెన్సీలో తమ తొలి మ్యాచ్ ఆడిన సిడ్నీ థండర్ రెండు వికెట్ల తేడాతో అడిలైడ్ స్ట్రైకర్స్‌ను ఓడించింది.

**ఆరంభ మ్యాచ్‌లలో విఫలం**

నాటి మ్యాచ్‌లో వార్నర్ కేవలం ఏడు పరుగులే చేశాడు. అనంతరం.. సిడ్నీ సిక్సర్స్‌తో తలపడ్డ సిడ్నీ థండర్(%వాఎంఅవవఎ ఞ్తబఅంవతీ%) ఐదు వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ వార్నర్ మరోసారి విఫలమయ్యాడు. కేవలం పదిహేడు పరుగులే చేసి నిష్క్రమించాడు. ఆ తర్వాత మెల్‌బోర్న్‌తో స్టార్స్‌తో మ్యాచ్‌లో వార్నర్ 19 పరుగులే చేసినా.. సామ్ బిల్లింగ్స్(72 నాటౌట్) కారణంగా.. సిడ్నీ థండర్ 18 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ క్రమంలో సోమవారం నాటి మ్యాచ్‌లో మెల్‌బోర్న్ గ్రెనేడ్స్‌తో మ్యాచ్‌లో మాత్రం వార్నర్ బ్యాట్ ఝులిపించాడు.

ఎట్టకేలకు బ్యాట్ ఝులిపించాడు

సిడ్నీలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన మెల్‌బోర్న్ తొలుత బౌలింగ్ చేసింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన సిడ్నీ థండర్ ఆదిలోనే కామెరాన్ బాన్‌క్రాఫ్ట్(8) వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్ బ్యాటర్ షెర్ఫానే రూథర్‌ఫర్డ్(11), ఒలివర్ డేవిస్(10), సామ్ బిల్లింగ్స్(10) కూడా విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో ఇన్నింగ్స్ గాడిన పెట్టే బాధ్యత తీసుకున్న ఓపెనర్ వార్నర్ నెమ్మదిగా ఆడాడు. వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ.. 40 బంతుల్లో యాభై పరుగులు మార్కుకు చేరుకున్నాడు. ఆ తర్వాత మరో పదిహేడు బంతుల్లోనే 36 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు.మొత్తంగా 57 బంతులు ఎదుర్కొని పది ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో వార్నర్ 86 పరుగులు సాధించాడు. అతడి తోడుగా మాథ్యూ గిల్క్స్(23 నాటౌట్) కూడా రాణించాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో సిడ్నీ థండర్ నాలుగు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది.

**2013లో చివరగా**

కాగా డేవిడ్ వార్నర్ బీబీఎల్‌లో చివరగా 2013లో అర్ధ శతకం నమోదు చేశాడు. ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్ ప్రస్తుతం ఫ్రాంఛైజీ క్రికెట్‌లో ఆడుతున్నాడు. అయితే, ఐపీఎల్‌లో గతంలో మంచి రికార్డులే ఉన్నా మెగా వేలం 2025లో మాత్రం వార్నర్‌పై ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపలేదు. దీంతో అతడు అమ్ముడుపోకుండా మిగిలిపోయాడు. ఒకవేళ బీబీఎల్‌లో గనుక పరుగుల వరద పారిస్తే.. అతడు ఐపీఎల్‌లో తిరిగి పునరాగమనం చేసే అవకాశం ఉంటుంది. కాగా తమ ఆటగాళ్లు ఎవరైనా గాయపడిన సందర్భంలో ఫ్రాంఛైజీలు .. వారి స్థానంలో అన్‌సోల్డ్‌గా ఉన్న క్రికెటర్లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఓపెనర్‌గా ఘనమైన రికార్డు ఉన్న వార్నర్ సేవలను పంజాబ్ కింగ్స్ లేదంటే లక్నో సూపర్ జెయింట్స్ వాడుకునే అవకాశం ఉంది.





### ప్యాట్ కమిన్స్ వరల్డ్ రికార్డు.. ప్రపంచంలోనే తొలి కెప్టెన్‌గా

మెల్‌బోర్న్ వేదికగా భారత్‌తో జరిగిన నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా అద్భుతమైన విజయం సాధించింది. ఆఖరి రోజు వరకు జరిగిన ఈ బాక్సింగ్ డే పోరులో 184 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. దీంతో డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌కు అడుగు దూరంలో ఆసీస్ నిలిచింది. ఈ విజయంలో ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో కమ్మిన్స్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. బ్యాటింగ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 90 పరుగులతో పాటు 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కూడా లభించింది. ఇక ఈ మ్యాచ్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మను ఔట్ చేసిన పాట్ కమిన్స్ ఓ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు.

**చరిత్ర సృష్టించిన కమ్మిన్స్..**

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ప్రత్యర్థి కెప్టెన్‌ను ఎక్కువ సార్లు ఔట్ చేసిన సారథిగా కమిన్స్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. టెస్టుల్లో రోహిత్ శర్మను ఇప్పటివరకు కమ్మిన్స్ ఆరు సార్లు ఔట్ చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ రిచీ బెనాడ్ పేరిట ఉండేది. రిచీ బెనాడ్ ఇంగ్లండ్ లెజెండరీ కెప్టెన్ టెడ్ డెక్స్టర్‌ను 5 సార్లు ఔట్ చేశాడు. తాజా మ్యాచ్‌తో రిచీ బెనాడ్ ఆల్‌టైమ్ రికార్డును కమిన్స్ బ్రేక్ చేశాడు.

### అద్భుతమైన టెస్టు.. ఆఖరికి మాదే పైచేయి.. వాళ్లిద్దరు సూపర్: కమిన్స్



మెల్‌బోర్న్ టెస్టు అద్భుతంగా సాగిందని.. ఆఖరికి తామే పైచేయి సాధించడం పట్ల సంతోషంగా ఉందని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్( హర్షం వ్యక్తం చేశాడు. బంతితో పాటు బ్యాట్‌తోనూ తాను రాణించడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నాడు. ట్రవిస్ హెడ్‌కు బాల్ ఇవ్వడం వెనుక తమ కోచ్ హస్తం ఉందని.. ఈ విషయంలో క్రెడిట్ ఆయనకే ఇస్తానని కమిన్స్ తెలిపాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా సొంతగడ్డపై టీమిండియా తో ఐదు టెస్టులు ఆడుతోంది. ఈ క్రమంలో పెర్త్ మ్యాచ్‌లో ఓడిన కంగారూ జట్టు.. అడిలైడ్ టెస్టుతో విజయాన్ని రుచిచూసింది. అనంతరం బ్రిస్బేన్ టెస్టు వర్షం వల్ల డ్రా కాగా.. ఇరుజట్లు మధ్య మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో నాలుగో టెస్టు జరిగింది.

340 పరుగుల లక్ష్యం

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆతిథ్య ఆసీస్ తొలుత బ్యాటింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగులు చేసిన కంగారూలు.. భారత్‌ను 369 పరుగులకు కట్టడి చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌట్ అయిన కమిన్స్ బృందం.. టీమిండియాకు 340 పరుగుల లక్ష్యాన్ని విధించింది. అయితే, సోమవారం నాటి ఆఖరి రోజు ఆటలో భాగంగా 155 పరుగులకే ఆలౌట్ కావడంతో.. ఆసీస్ 184 రన్స్ తేడాతో జయభేరి మోగించింది. తద్వారా సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి దూసుకువెళ్లింది. ఇక ఈ మ్యాచ్‌లో మొత్తంగా 90(49, 41) పరుగులు చేయడంతో పాటు.. కమిన్స్ ఆరు వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

మాదే పైచేయి

ఈ క్రమంలో విజయానంతరం కమిన్స్ మాట్లాడుతూ.. “అద్భుతమైన టెస్టు మ్యాచ్ ఆడాము. ప్రేక్షకులు కూడా మాకు మద్దతుగా నిలిచారు. వారి నుంచి అద్భుత స్పందన లభించింది. విజయంలో నా పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉన్నాను. లబుషేన్(72, 70), స్మిత్(140, 13 ) రాణించడం వల్ల పటిష్ట స్థితిలో నిలిచాం. నిజానికి ఈరోజు తొలి సెషన్‌లో మాదే పైచేయి. కానీ అనూహ్య రీతిలో వాళ్లు పుంజుకుని.. రెండో సెషన్‌లో రాణించారు. అయితే, మేము మాత్రం సానుకూల దృక్పథంతోనే ఉన్నాము.ఫీల్డింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకున్నాం. ఇక హెడ్‌తో బౌలింగ్ చేయించాలన్నది మా కోచ్ ఆలోచనే. ఆ విషయంలో క్రెడిట్ మొత్తం ఆయనకే ఇస్తాను. జట్టు ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నాను” అని పేర్కొన్నాడు. సిడ్నీ టెస్టులోనూ ఇదే తరహా ఫలితం పునరావృతం చేస్తామని కమిన్స్ ధీమా వ్యక్తం చేశాడు. కాగా ఈ మ్యాచ్‌లో బ్యాటర్‌గా విఫలమైన ట్రవిస్ హెడ్(0, 1) రిషభ్ పంత్(%=అంప్తుఎప్త్రఖత్%-30) రూపంలో కీలక వికెట్ తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పడంలో సహాయం చేశాడు.